## జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



APTEL /25/A2478

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

గుంటూరు | సంపుటి : 02 | సంచిక : 261 | బుధవారం 03- 06 - 2026 | పేజిలు : 4 | వెల. 2/-



## రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జ్‌లు
- నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349




## నెతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం

**జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువరించింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేపట్టిన తాజా సైనిక చర్యల నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య ఉద్రిక్తతలు పెరిగినట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో దాడులను కొనసాగించడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెతన్యాహూతో ఫోన్‌లో ఘాటుగా మాట్లాడినట్లు సమాచారంనువ్వు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైలులో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ప్రస్తుతం అందరూ నిన్ను ద్వేషిస్తున్నారు. నీ చర్యల వల్ల ఇజ్రాయెల్‌పై కూడా వ్యతిరేకత పెరుగుతోంది.

2లో

# నమస్కారం పెట్టి పక్కనపెట్టేస్తాను



**అమరావతి, జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్ఐఆర్‌పై వర్క్ షాప్‌లో ఏపీ సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 4న ఎన్డీఏ నేతల సమావేశం జరగనుందని తెలిపారు. రాష్ట్ర, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీల నియామకం జరగనున్నట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మిత్రపక్షాలను కలుపుకువెళ్లాలని.. బలం ఎక్కువా తక్కువా అనేది అనవసరమని, అటువంటి ఆలోచనలు కూడా పెట్టుకోవద్దన్నారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేలకు సీఎం స్పష్టం చేశారు. జెండా మోయాలంటే జెండా ద్వారా వచ్చిన అధికారంలో కార్యకర్తలను భాగస్వామ్యులను చేయాల్సిందే అని చెప్పారు.పదవి ఎవరికీ శాశ్వతం కాదని.. పనిచేసినంత కాలం పదవికి ఢోకా ఉండదని సీఎం అన్నారు. పని చేయకపోతే నమస్కారం పెట్టి ఎటువంటి మొహమాటం లేకుండా పక్కనపెట్టేస్తానని తేల్చిచెప్పేశారు. ఎవరూ వన్ టైం ఎమ్మెల్యేగా మిగిలిపోవద్దన్నారు. అమెరికన్ డెమోక్రసీలో రెండు సార్లు మాత్రమే ఎన్నికయ్యేందుకు అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. 'మన దగ్గర ప్రజలు మెచ్చినంత కాలం మనం ఎమ్మెల్యేగా ఉండవచ్చు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగుంటే.. ఓట్లు పడతాయి.. ప్రజలు ఆదరిస్తారు. ఎమ్మెల్యేల ప్రవర్తన బాగోలేకపోతే ఓట్లు పోతాయి.. ఆ విషయం అందరూ గుర్తుపెట్టుకోవాలి. పనిచేయకపోయినా పర్వాలేదు.. నోరు మాత్రం పారేసుకోవద్దు. తస్మాత్... జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యేలను చంద్రబాబు హెచ్చరించారు.

# తెలంగాణలో

## జనసేన పోటీ చేస్తుంది: పవన్ కల్యాణ్




**హైదరాబాద్, జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ అంతర్భాగమని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉ

2లో

## సునీల్ కుమార్ వ్యాఖ్యలపై విచారణ చేయాలి: రఘురామకృష్ణరాజు

**పశ్చిమగోదావరి జిల్లా, జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో జరిగిన ఓ సమావేశంలో అనవసరంగా ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలపై పోలీసులు విచారణ చేపట్టాలని సూచించారు. 4000 ఎస్సీ, ఎస్టీ కేసులపై ఛార్జిషీటు వేయించానని ఆయన ఎలా మాట్లాడారని ప్రశ్నించారు. సీబీ సీఐడీకీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంచలనమైన కేసులు ఉంటే తప్ప.. 200 కేసులకు మించి తీసుకోవడానికి వీల్లేదని చెప్పారు. 4000 కేసుల్లో ఛార్జిషీటు వేయించానని పీవీ సునీల్ కుమార్ బరితెగించి



మాట్లాడటం విడ్డూరంగా ఉందని రఘురామ కృష్ణరాజు విమర్శించారు. తన కస్టోడియల్ టార్చర్ కేసులో ఆయన పాత్ర ఉందని క్లీయర్ గా అర్థమైందని చెప్పారు. ఛార్జీషీట్లు వేయించడంలో ఆయనకి సంబంధం ఏమిటనే విషయంపై పోలీసులు విచారణ చేయాలని సూచించా రు. భీమవరంలో జరిగిన సమావేశానికి జాన్‌మార్క్

2లో



## గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.

**ఇంటర్నెట్ డెస్క్:** గుజరాత్–మహారాష్ట్ర హైవేపై మంగళవారంఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రెండు బస్సులు, ఒక ట్రాక్టర్ ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో ఏడుగురు ప్రయాణికులు మంటల్లో చిక్కుకుని సజీవదహనమవగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. బర్దోలి తాలూకాలోని ఊవా, మానేక్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న ధూలే–సూరత్ జాతీయ రహదారిపై ఈ విషాదం చోటుచేసుకుంది. ధూలే నుంచి నవాపూర్ మీదుగా సూరత్‌కు వెళ్తున్న ఒక ఎస్టీ బస్సు,

2లో

## సీబీఎస్ఈ పోర్టల్‌పై సైబర్ దాడి..

**ఇంటర్నెట్ డెస్క్:** సీబీఎస్ఈ రీవాల్యుయేషన్, వెరిఫికేషన్ దరఖాస్తుల కోసం ప్రారంభించిన పోర్టల్‌పై సైబర్ దాడి ప్రయత్నాలు జరిగినట్లు బోర్డు తెలిపింది. అయితే, ఈ దాడుల మధ్య కూడా పోర్టల్ ఎలాంటి అంతరాయం లేకుండా పనిచేసిందని తెలిపింది. రీవాల్యుయేషన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైన తొలి రోజే కొందరు దుండగులు పోర్టల్ సేవలకు అంతరాయం కలిగించే ప్రయత్నం చేసినట్లు సీబీఎస్ఈ పేర్కొంది. ముఖ్యంగా 'డినయల్ ఆఫ్ సర్వీస్' అనే సైబర్ దాడి ద్వారా పోర్టల్ సేవలను ప్రభావితం చేయాలని ప్రయత్నించినట్లు తెలిపింది. సీబీఎస్ఈ తెలిపిన వివరాల ప్రకారం, కేవలం రెండు నిమిషాల వ్యవధిలోనే పోర్టల్‌పై సుమారు 15 లక్షల రిక్వెస్టులు (హిట్స్) వచ్చాయి. అంతేకాకుండా, సిస్టమ్‌లోని



ఫైళ్లను అనధికారికంగా యాక్సెస్ చేయడానికి లక్షకు పైగా ప్రయత్నాలు జరిగినట్లు సీబీఎస్ఈ తెలిపింది. వేలాది మంది విద్యార్థులు ఒకేసారి పోర్టల్‌ను ఉపయోగిస్తున్న

## దేవినేని అవినాష్ వినూత్న నిరసన

**జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తాగునీటి కోసం ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గుణదల కొండ ప్రాంత ప్రజల తాగునీటి హక్కుల రక్షణ కోసం గోతిలోకి దిగి ధర్నా నిర్వహించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్న దేవినేని అవినాష్.. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని గుణదల కొండ ప్రాంత ప్రజల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోందని విమర్శించారు. గద్దెవారి పొలాల పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, భారీ కమర్షియల్ భవనాల కోసం గుణదల కొండ ప్రాంతానికి చెందాల్సిన



తాగునీటిని తరలించేందుకు కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారంటూ ఆరోపించారు. వైసీపీ హయాంలో వైఎస్ జగన్ నాయకత్వంలో గుణదల కొండ ప్రాంతంలో దశాబ్దాలుగా

2లో


గుంటూరు, ప్రకాశం, విజయవాడ, కాకినాడ, అనంతపూర్, కడప ఎడిషన్లతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా వెలువడుతున్న క్రైం కౌంటర్ దినపత్రికలో వ్యాపార ప్రకటనలకు సంప్రదించండి. 9849707349

## నెతన్యాహూపై ట్రంప్ ఆగ్రహం

అసలు నువ్వు ఏం చేస్తున్నావు' అని నెతన్యాహుపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హెజ్‌బొల్లాకు చెందిన ఓ సైనిక కమాండర్‌ను హతమార్చేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో అమాయకులైన లెబనీస్ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ట్రంప్ ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోందిబీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను ఖాళీ చేయాలని అక్కడి ప్రజలను ఇటీవల ఇజ్రాయెల్ హెచ్చరించింది లెబనాన్‌పై దాడులు చేస్తే శాంతి చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ బెదిరించింది. దీంతో నెతన్యాహుతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఆ తర్వాత హెజ్‌బొల్లా నాయకులతోనూ మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్' ద్వారా ట్రంప్ తెలిపారు.

## తెలంగాణలో జనసేన పోటీ చేస్తుంది: పవన్ కల్యాణ్

న్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు.తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు పవన్ కల్యాణ్. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని ఏపీ డిప్యూటీ సీఎం గుర్తు చేశారు.ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించాను? అని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు.గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చురకలంటించారు.

## గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.

ఎదురుగా వస్తున్న మరో ఎస్టీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ భీకర ప్రమాద ధాటికి బస్సుల్లో ఒకటి జాతీయ రహదారిపైనే బోల్తా పడింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బస్సు బోల్తా పడిన కొద్ది క్షణాల్లోనే పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి, మంటలు క్షణాల వ్యవధిలో వాహనం అంతటా వేగంగా వ్యాపించాయి. దీంతో బస్సులో ఉన్న కొంతమంది ప్రయాణికులకు బయటకు వచ్చే అవకాశం కూడా లభించలేదు. ఫలితంగా ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే స్థానిక అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, 108 అంబులెన్స్ వాహనాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సూరత్ రూరల్ ఎస్పీ రాజేశ్ గధియా మాట్లాడుతూ.. 'అగ్నిమాపక దళం బస్సులో చెలరేగిన మంటలను అదుపులోకి తెచ్చారు. క్షతగాత్రులను రక్షించి వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాం. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం బార్డోలిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నాం' అని అన్నారు.

## సునీల్ కుమార్ వ్యాఖ్యలపై విచారణ చేయాలి: రఘురామకృష్ణరాజు

అనే వ్యక్తి ఢిల్లీ నుంచి వచ్చి మాట్లాడారని చెప్పారు. ఆయన సమావేశంలో మాట్లాడుతూ.. వాళ్లను వేసేయాలని.. వీళ్లని వేసేయాలని పిచ్చిపిచ్చిగా మాట్లాడారని ధ్వజమెత్తారు. మంచి ప్రభుత్వం అని చెప్పి హింసను ప్రేరేపిస్తూ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకుంటారా..? లేదా..? అనేది ఈ ప్రభుత్వ విచక్షణకే వదిలేస్తున్నానని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు.

## సీబీఎస్ఈ పోర్టల్‌పై సైబర్ దాడి..

సమయంలో, సైబర్ దుండగులు సేవలకు అంతరాయం కలిగించేందుకు పలు దాడులకు పాల్పడ్డారని బోర్డు వెల్లడించింది. అయితే ఈ దాడులు జరిగినప్పటికీ పోర్టల్ సమర్థవంతంగా పనిచేసిందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఒకేసారి 8,000 మందికి పైగా వినియోగదారులు సేవలను ఉపయోగించగలిగే విధంగా వ్యవస్థను రూపొందించామని తెలిపింది. మధ్యాహ్నం 3 గంటల నాటికి 18,000కు పైగా రీవాల్యుయేషన్, వెరిఫికేషన్ దరఖాస్తులు విజయవంతంగా నమోదు అయినట్లు సీబీఎస్ఈ తెలిపింది. విద్యార్థుల సూచనల మేరకు పోర్టల్‌లో పలు మార్పులు కూడా చేసినట్లు బోర్డు వెల్లడించింది. దరఖాస్తు ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి సెషన్ టైమ్ లిమిట్‌ను పెంచినట్లు పేర్కొంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు తమ సాంకేతిక బృందాలు పోర్టల్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నాయని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.

## దేవినేని అవినాష్ వినూత్న నిరసన

ఉన్న తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించామన్నారు దేవినేని అవినాష్. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకుచర్యలు చేపట్టామని తెలిపారు.అయితే నేడు కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుతున్న నీటిని సైతం దొంగిలించి, అక్రమంగా గద్దెవారి పొలాలకు తరలిస్తోందని దేవినేని అవినాష్ ఆరోపించారు. ఇంత జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు కేవలం షో రాజకీయాలు, అబద్ధపు ప్రచారాలు, కుల రాజకీయాలు చేయడంపైనే ఆసక్తి ఉందని, ప్రజల సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదని మండిపడ్డారు. రెండు రోజులుగా గుణదల కొండ ప్రాంత ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించకుండా స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విస్మరించారని అవినాష్ విమర్శించారు.మరోవైపు దేవినేని అవినాష్ ఆందోళనతో అధికారులు స్పందించారు. గుణదల కొండ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, నీటి తరలింపును అడ్డుకుంటామని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) ఎస్ఈ రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకూడదని దేవినేని అవినాష్ స్పష్టం చేశారు. ప్రజలకు ఏ చిన్న ఇబ్బంది వచ్చినా, తాగునీటి సమస్య తలెత్తినానేరుగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో కూడా తూర్పు నియోజకవర్గ ప్రజలకు వైసీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలింగ్ రిఫ్రిజిరేటర్ బహుకరణ




**వేటపాలెం, జూన్ 2 (క్రైమ్ కౌంటర్):** వేసవి కాలంలో పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు చల్లటి తాగునీరు అందుబాటులో ఉండేలా వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు వాటర్ కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ను బహుకరించారు.చీరాల నియోజకవర్గ శాసనసభ్యుడు మద్దులూరి మాలకొండయ్య ఆదేశానుసారం, బాపట్ల జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షులు మరియు చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దోగిపర్తి బాలకృష్ణ ఈ కూలింగ్ రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా వేటపాలెం పోలీస్ స్టేషన్ ఆఫీసర్ పి. జనార్ధన్ రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభించి, ప్రజల సౌకర్యార్థం అందించిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు జాగబత్తుని పోతురాజు, వైశ్య ఫెడరేషన్ సభ్యులు కొత్త శ్రీనివాసరావు, చుండూరు సురేష్, మాజేటి వెంకట సుబ్బారావు, గట్టా రమేష్, చుండూరు నాగాంజనేయులు, శేఖర్, గ్రామ ప్రజలు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా సేవలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.



## నందిగం చేతుల మీదగా పాస్ బుక్ లు పంపిణీ

**: క్రైం కౌంటర్ కోటేశ్వరరావు అచ్చంపేట న్యూస్ :** పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు రైతులకు రీ సర్వే ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతినిధులు . రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , రెవిన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ , పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పల్నాడు జిల్లాలో అచ్చంపేట మండలంలోని మొట్టమొదటి గ్రామముగా పైలెట్ ప్రాజెక్టు కింద కస్తాల గ్రామాన్ని ఎంపిక చేసుకుని రీ సర్వే కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో పారదర్శకంగా పూర్తి చేసుకొని కస్తల అగ్రహారం గ్రామంలో జరిగిన రీ సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా కస్తల గ్రామాన్ని పూర్తిస్థాయిలో 100% తప్పులు లేకుండా రీసర్వే చేసి కచ్చితత్వమైనటువంటి పట్టాదారు పాస్ బుక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది, రెవిన్యూ శాఖ వారు చేపట్టినటువంటి రీ సర్వే కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి కస్తల గ్రామస్తులందరికీ అడంగల్, పట్టాదారు పాసుబుక్కులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజముద్రతో పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం మండల తహసీల్దారు సిహెచ్ శ్రీనివాస్ రావు, డిసి చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి,
కస్తల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొర్లగుంట శ్రీధర్, బాలినేని సదాశివరావు, షేక్ ఖాజావలి, బత్తుల నాగేశ్వరరావు, గుడేటి యెహోషువ, నాగేశ్వరావు ,సుభాని, మరి ఇతర రెవిన్యూ అధికారులు గ్రామ పెద్దలు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు

## గ్రామ శివారులోని ఒక జీడిమామిడి తోటలో తల్లికూతుర్ల మృతదేహాలు లభ్యమవడం తో గ్రామం లో తీవ్ర కలకలం



**ది 02 జూన్ 2026. (క్రైమ్ కౌంటర్)** ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం నల్లమడు గ్రామ శివారులోని ఒక జీడిమామిడి తోటలో తల్లికూతుర్ల మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపింది. మరణించిన వారిని తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామానికి చెందిన వడ్డే వెంకటలక్ష్మి (తల్లి), వరలక్ష్మి (కూతురు) గా గుర్తించారు. దూబచర్ల నుండి చేబ్రోలు వెళ్లే రహదారి పక్కన ఉన్న జీడిమామిడి తోటలో (చేలో) రెండు మృతదేహాలు వేర్వేరు ప్రదేశాల్లో పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఘటనా స్థలంలో మృతి చెందిన ఒక మహిళ తలకు బలమైన గాయం ఉన్నట్లు సమాచారం అందుతోంది. సమాచారం అందుకున్న వెంటనే చేబ్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ మహిళలకు సంబంధించిన ఒక హ్యాండ్ బ్యాగ్ లభ్యమైంది. ?ఈ ఘటన హత్యనా లేక మరేదైనా కారణమా అనే కోణంలో చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియవలసిఉన్నది.

## జిల్లా అభివృద్ధి పనుల విషయమై భూ సేకరణపై జరిగిన సమావేశం నందు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్

**ది 02 జూన్ 2026. (క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** అభివృద్ధి పనులకు భూ సేకరణ వేగంగా చేపట్టాలని అరవిన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, భూ సేకరణపై రెవెన్యూ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు జిల్లాలో 54 మంజూరు కాగా వాటికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 124 ఎకరాల భూసేకరణ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో జాప్యం ఉండరాదని సూచించారు. జులై 10వ తేదీ నాటికి డిపిఆర్ సిద్ధం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. ఎస్ టి పి కి భూమి కేటాయించాలన్నారు. భూసేకరణ చట్టప్రకారం జరగాలని, తద్వారా అభివృద్ధి సాధ్యమన్నారు. పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో తీరం నుంచి రెండు కిలోమీటర్ల దూరం వరకు భూముల సర్వేపై సంక్షిప్త నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రైవేటు భూముల వివరాలు సేకరించాలన్నారు. తదుపరి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. రెవిన్యూ దస్త్రాలలో అటవీ భూములు, జంగిల్ భూములు, మడ అడవులు, చిట్టడివి, అటవీ భూములు, తోపులు అని ఉంటే వాటి వివరాలన్ని సేకరించాలన్నారు. తీర ప్రాంతాలలో వివిధ ప్రాజెక్టులు, కంపెనీలు వస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మార్గ నిర్దేశం చేశారు. పిజిఆర్ఎస్ లో అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాపట్ల, కారంచేడు, మార్టూరు మండలాలలో పెండింగ్ లో ఉన్న అర్జీలు త్వరగా పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, సమస్యలు పరిష్కార దిశగా అధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. ఈకేవైసీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ గ్లోరియా, చీరాల ఆర్డీవో




లవన్న, రేపల్లె ఆర్డిఓ శ్రీదేవి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, మండల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా న్యాయవాది సత్యనారాయణ జన్మదిన వేడుకలు





**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు సత్తెనపల్లి అర్బన్ :** పల్నాడు జిల్లా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఆర్ ఎస్ ఎస్ సత్తెనపల్లి సంఘ్ చాలక్, సరస్వతి శిశు మందిర్ పాఠశాల కార్యదర్శి చలువాది చిన్న సత్యనారాయణ 61 వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కక్షిదారులకు సత్వరమే న్యాయ సహాయం అందించటంతో పాటు మరోపక్క ఆర్ ఆర్ ఎస్, శిశు మందిర్ పాఠశాల బలోపేతానికి సత్యనారాయణ తన వంతుగా కృషి చేస్తూ ఎంతోమంది కి ఆదర్శం గా నిలిచారని ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు అభినందించారు.

అనంతరం పలువురు సత్యనారాయణ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి సురేష్ బాబు, మాజీ ఎజీపీ, ఏపీపీ బగ్గి నరసింహారావు, మాజీ ఏజీపీ అనుమోలు జయరామ్, సీనియర్ న్యాయవాదులు ఇరగంటి ఎల్లారెడ్డి, చిట్టా విజయ్ భాస్కర్ రెడ్డి, గుజ్జర్లపూడి మార్క్ రావు, రాజారపు శివనాగేశ్వరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, మారూరి లింగారెడ్డి, బాలకోటయ్య, మేదర అనిల్ కుమార్, పాటిబండ్ల రవి, సైదయ్య, పూర్ణచంద్ర, పూర్ణ, మదన్ గోపాల్, వి.పాపారావు, పవన్ కుమార్, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.పొట్టి శ్రీరాములు పార్క్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో....పొట్టి శ్రీరాములు పార్క్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉదయం సీనియర్ న్యాయవాది, ఆర్ ఎస్ ఎస్ సత్తెనపల్లి సంఘ్ చాలక్, సరస్వతి శిశుమందిర్ కార్యదర్శి చలువాది చిన్న సత్యనారాయణ 61 జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కార్యక్రమంలో యెల్లినేడి వెంకటేశ్వరరావు (బీడీఆర్ ), పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, న్యాయవాదులు రాజారపు శివనాగేశ్వరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు కాండ్రు వెంకట్రావు, పంచాయతీ రాజ్ విశ్రాంత ఉద్యోగి లింగిశెట్టి సుబ్బారావు, విశ్రాంత పోస్టల్ అధికారి మక్కపాటి ప్రసాద్, తెదేపా నాయకులు గంగూరి వెంకట్రావ్, యెల్లినేడి పట్టాబి రామారావు, దమ్మాలపాటి విజయ చారి, సుకమంచి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు, బాలల భద్రతే ధ్యేయం

**దిమ్మగుడి, గంజిగుంటపల్లి గ్రామాల్లో పోలీసుల అవగాహన సదస్సులు,!!**

**పెద్దవడుగూరు, జూన్ 2 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** మహిళలు, బాలల భద్రతే ధ్యేయంగా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని పెద్దవడుగూరు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని దిమ్మగుడి, గంజిగుంటపల్లి గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళలపై జరుగుతున్న వేధింపుల నివారణకు, వారి రక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని భరోసా ఇచ్చారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు తక్షణ సహాయం పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న 'శక్తి యాప్', 'స్త్రీ రక్ష పోర్టల్' పనితీరును, వాటిని మొబైల్‌లో ఎలా ఉపయోగించాలో గ్రామస్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రజలు వెంటనే 'డైల్ 100' లేదా '112' నంబర్లకు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని కోరారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా ఇలాంటివి జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే '1098' టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. అలాగే, యువత గంజాయి మరియు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే '1930' నంబర్‌కు ఫిర్యాదు చేసి తమ సొమ్మును కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానంద కాలనీలో మౌలిక సదుపాయాల కొరతపై స్థానికుల ఆవేదన





**వేటపాలెం జూన్ 2 (క్రైమ్ కౌంటర్):** వేటపాలెం మండలం, చల్లారెడ్డి పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీ ప్రజలు పలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పారిశుద్ధ్య లోపం కారణంగా చెత్త పేరుకుపోవడం, దోమలు వ్యాపించడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. అదే విధంగా బెల్ట్ షాపుల బెడద రోజురోజుకు పెరుగుతుండటంతో సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయని, గ్రామ పరిసరాల్లో భూ ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. కాలనీలో స్మశాన వాటిక లేకపోవడం వల్ల మరణించిన వారి అంత్యక్రియల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇక తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ స్థానిక ప్రజలు చల్లారెడ్డి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యలను విన్న ఆయన, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. స్థానికులు కూడా తమ కాలనీలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.



# కాల్వ రవి కి కళానంది అవార్డ్.

**క్రైమ్ కౌంటర్ నరసరావుపేట. (ప్రతినిధి.జి.ఎం.కె. గాంధీ.)–** మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్ట్ సహకారంతో మన కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళానంది అవార్డ్స్ నిర్వహించిన కార్యక్రమంలో త్యాగరాయ గాన సభ హైదరాబాద్ చిక్కడపల్లి లో నిర్వహించిన కళా నంది అవార్డ్స్ కార్యక్రమంలో ఆంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు అంబేద్కర్ ఆశయ సాధన సమితి జాతీయ అధ్యక్షులు కాల్వ రవి చేసిన సేవలను ప్రజల కోసం చేసిన ఉద్యమాలను అలాగే అంబేద్కర్ చిత్రపటాన్ని భారత కరెన్సీ నోట్లు పై ముద్రించాలని గత 15 సంవత్సరాల పైగా ఉద్యమం చేస్తున్నందుకు గాను కాల్వ రవి కి ప్రముఖ సినీ నటులు సినీ నిర్మాతలు అవార్డును అందజేసారు. అనంతరం కాల్వ రవికి ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ నా సేవలను గుర్తించి ప్రముఖులు నన్ను సన్మానించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ స్పూర్తితో మునుముందు ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేప డతానని తెలిపారు. ఈ కార్యక్రమం జరగడానికి సహకరించిన మిత్రులకు,సన్మాన కర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# జలధార జలహారతి ద్వారా నిజాంపట్నం గురునాథనగర్ ఫీడర్ కాల్వ కు మరమ్మత్తులు

## – వర్షం నీరు భద్రం
## – భూగర్భ జలాలు పెంపు
## – కాల్వల్లో జల ప్రవాహం
## – బీడు భూములకు జలధారలు







**ది 02 జూన్ 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** ఆయకట్టు భూములలో జలధారలు ప్రవహించనున్నాయి. ఇప్పటివరకు ఒట్టిపోయిన భూములలో ఇకనుంచి సిరులు పండనున్నాయి. బీడుగా మారిన భూములన్ని జల కళను సంతరించుకోనున్నాయి. చివరి భూములకు సైతం సాగునీరు అందించాలని కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తోంది. ఆ దిశగా రైతులకు మేలు చేయాలని జలధార జలహారతి కింద నిజాంపట్నం గురునాథనగర్ ఫీడర్ కాల్వను ఎంపిక చేసింది. దీంతో ఎంతోకాలంగా ఆశతో ఎదురు చూస్తున్న రైతుల కలలు నెరవేరనున్నాయి. వర్షం నీటిని భద్రపరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలనుస్తోంది. ఇప్పటివరకు అడుగంటిన భూగర్భ జలాలు మెరుగుపడే అవకాశం ఉంది. నిరుపయోగంగా మారిన భూములన్ని వర్షాలు కురిస్తే జీవం పోసుకోనున్నాయి.

**అభయం**

ఆయకట్టు చివరి భూములకు నీరు ఇస్తామని కూటమి ప్రభుత్వం చేసిన ప్రకటనలు నేడు కార్యరూపం దాల్చనున్నాయి. జలధార జలహారతి కార్యక్రమం కింద సాగునీరు అందించేందుకు ప్రభుత్వం భగీరథ ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా పాడైపోయిన ఫీడర్ కాల్వలను పునరుద్ధరిస్తోంది. ఈ పనులంతా సాగునీటి సంఘాలలోని రైతులకు బాధ్యత అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆ మేరకు 100ల పాటు సమగ్ర ప్రణాళికలను రూపొందించింది. కాల్వల పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అండగా నిలుస్తుంది. కాల్వలను శుభ్రం చేయడానికి ముందుకు వచ్చిన రైతులకు ప్రభుత్వం చేయూతనిస్తోంది.

**భూగర్భ జలాలు**

అట్టడుగుకు వెళ్తున్న భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. వర్షాలు కురిస్తే వర్షం నీటిని భద్రం చేయాలని సంకల్పించింది. గురునాథనగర్ గ్రామంలోని జి.రాజయ్య పొలం నుంచి శశిశేఖర్ పొలం వరకు ఫీడర్ కాల్వను పునరుద్ధరిస్తున్నారు. 120 మీటర్ల.పొడవున, రెండు మీటర్ల వెడల్పు, ఒక మీటర్ లోతు వరకు కాల్వ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఆ గ్రామం నుంచి 40 మంది గ్రామస్తులు ముందుకు వచ్చి పనులు చేస్తున్నారు. గుణపాలు, చెలకపారలు చేతపట్టి మరమ్మతు పనులు చేస్తున్నారు. వర్షాలు రాకముందే పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ క్రమంలో నిరుపేదల వలసలు తగ్గు ముఖం పడుతున్నాయి. మరోవైపు పేదలకు ఉపాధి అవకాశం మెరుగు పడుతుంది.

**ప్రయోజనం బోలెడు**

జలధార జలహారతి కార్యక్రమంతో గురునాథనగర్ ఫీడర్ కాల్వ పునర్జీవం పోసుకోనుంది. వర్షాలు కురిస్తే పంట కాల్వలో పుష్కలంగా జలం ప్రవహించనుంది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో బీడు భూములకు జలాలు రానున్నాయి. నిరుపయోగంగా మారిన ఫీడర్ కాల్వలు, తూములు శుభ్రం కానున్నాయి. 100 ఎకరాల భూములకు సాగునీరు అందించే అవకాశం ఉంది. తద్వారా 35 మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతుంది. ఈ కాల్వ సమీపంలోని వ్యవసాయ బోర్లు రీఛార్జ్ కానున్నాయి. పరోక్షంగా మరికొంతమంది లబ్ధి పొందనున్నట్లు అధికారులు అంచనా వేశారు. దీంతో గ్రామస్తులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వ్యవసాయ రంగానికి ఎంతో మేలు చేకూరుస్తుందని గ్రామస్తులు అంచనా వేస్తున్నారు.

# ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులు పడే అవకాశం

**జూన్ 02 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వేసవి కాలం.. అందునా రోహిణి కార్తె కావడంతో ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాల ప్రవేశానికి ఇంకా సమయం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో తీవ్రమైన ఎండలు, గాలిలో తేమ లేకపోవడంతోపాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అలాంటి వేళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం ఉరుములు మెరుపులతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.విశాఖపట్నం, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, పార్వతీపురం మన్యం, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు విజయనగరం, విశాఖపట్నం, మన్యం అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, అనకాపల్లితోపాటు ఉభయ గోదావరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు స్పష్టం చేసింది.



## పెద్దపప్పూరులో భారీ కేబుల్ వైర్ల చోరీ ముఠా అరెస్ట్

### రూ. 2 లక్షల విలువైన సొత్తు స్వాధీనం,!!



**పెద్దపప్పూరు, జూన్ 2 క్రైమ్ కౌంటర్ న్యూస్ రాము రిపోర్టర్** మండల పరిధిలో ఇటీవల జరిగిన భారీ కేబుల్ వైర్ల చోరీ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ చోరీ ఘటనపై జిల్లా అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయడంతో ఐదుగురు నిందితుల ముఠా పోలీసులకు చిక్కింది. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుండి రూ. 2 లక్షల విలువైన సుమారు 800 మీటర్ల కేబుల్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులంతా తాడిపత్రి పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా గుర్తుతెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. పెద్దవడుగూరు, సిఐ రామసుబ్బయ్య, పెద్దపప్పూరు ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి టెన్నిస్,క్రికెట్ టోర్నమెంట్లోకి బహుమతులు.





**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా,దుర్గి మండలం,ముటుకురు గ్రామంలో రాష్ట్ర స్థాయి టెన్నిస్ బల్ క్రికెట్ టోర్నమెంట్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు,ప్రథమ బహుమతి మండవ రవి స్నేహబంధం ద్వారా, ద్వితీయ,తృతీయ బహుమతి పొందిన వారికి బహుమతిని అందజేస్తున్న ముటుకూరు ఎస్సీ కాలనీ యూత్ ఆర్గనైజేషన్ వారి సమక్షంలో బహుమతులు అందరు చేశారు.ప్రథమ బహుమతి 30 వేల రూపాయలు మండల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మండవ రవి సన్నిహితుల ఆధ్వర్యంలో 30 వేల రూపాయలు అందజేశారు.రెండో బహుమతి మాచర్ల వారి చేతుల మీదుగా అందజేశారు.అలాగే మూడవ బహుమతి సానియా ప్లే వుడ్ అండ్ గ్లాస్సెస్ ముటుకూరు గ్రామస్తుల అందజేశారు.అలాగే భవిష్యత్తులో ఇలాంటి బహుమతులు ఎన్నో గెలుచుకోవాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చ్ పాస్టర్ కటికల యేసుదానం అలాగే మండవ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మండల రవి ఫ్రెండ్ సర్కిల్ గ్రామస్తుల సమక్షంలో బహుమతులు అందజేశారు.ఈ టోర్నమెంట్ కి సహాయం,సహకారాలు బహుమతులు అందజేసిన మండవ చారిటబుల్ ట్రస్ట్ వారికి,గ్రామస్తులకు,ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసిన క్రికెట్ టోర్నమెంట్ యాజమాన్యం.

## పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్ అభివృద్ధి, ఆర్థిక వనరుల లభ్యత విషయాలపై జిల్లా కలెక్టర్ సమావేశం లో పాల్గొన్న అధికారులు

**ది 02 జూన్ 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్ అభివృద్ధి, ఆర్థిక వనరుల లభ్యత సామర్థ్యాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో హైబ్రిడ్ మోడ్ లో ఆయన సమావేశం నిర్వహించారు.సూర్యలంక బీచ్ ను రూ.97.52 కోట్లతో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో పర్యాటక రంగానికి సంపద సృష్టించే శక్తి, సామర్థ్యాలు, ఆర్థిక వనరుల లభ్యతను గుర్తించాలని కలెక్టర్ సూచనలిచ్చారు. అటవీ శాఖ ఆధీనంలో ఉండే మడ అడవులు కదిలించకుండా పార్టీ అభివృద్ధికి ప్రణాళిక రూపందించాలన్నారు. పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రక్రియ కొనసాగించాలన్నారు. సూర్యలంక బీచ్ మాదిరిగా అభివృద్ధి చేయడానికి సిద్ధం చేసిన డి పి ఆర్, సమగ్ర ప్రణాళికను రాష్ట్ర ముఖ్యమంత్రి కి అందించనున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ వెళ్తున్నారన్నారు. అక్కడ నుంచి బడా కంపెనీలను పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్ కు ఆహ్వానించే అవకాశం ఉందన్నారు. ఇందు కొరకు సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎంఓ నుంచి సందేశం వచ్చిందన్నారు. ఆర్థిక ఎదుగుదల, సంపద సృష్టించే అంశాలపై పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. సింగపూర్ నుంచి ప్రతినిధి బృందం బాపట్ల జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. చిన్నగంజాం మండలం ఏటిమొగ్గ గ్రామంలో సముద్ర నాచు ఉత్పత్తి వృద్ధికి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను స్ఫూర్తిగా తీసుకుని తీర ప్రాంతంలో



సంపద సృష్టించే దిశగా అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులు ప్రణాళికలు రూపొందించాలని ఆయన పలు సూచనలు చేశారు. సముద్ర నాచుతో మహిళలకు జీవనోపాధి అవకాశాలను కల్పించడం, ఆర్థిక ఎదుగుదలకు మన వంతు కృషి, సహకరించడం ముఖ్యమన్నారు. బీచ్ ల వద్ద ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించి, ప్రత్యామ్నాయ మార్గాలను కల్పించాలన్నారు. పొట్టి సుబ్బయ్యపాలెం నుంచి పాండురంగాపురం వరకు అన్ని రహదారులను ఏకం చేస్తూ బీచ్ వద్ద పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యమన్నారు. ఆదిశగా ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. అన్ని వనరులు సమకూర్చడం, పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడం ముఖ్యమన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఆనంద్ సత్యపాల్, కన్సల్టెన్సీ ప్రతినిధి శివ, వివిధ కన్సల్టెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కాం లో ఇరుక్కున్న కవిత ఆంధ్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు-డాక్టర్ గోదా రమేష్ కుమార్.

**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట (ప్రతినిధి జి.ఎం.కె. గాంధీ.)**-దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన లిక్కర్ స్కాంలో జైలుకెళ్లి వచ్చిన తెలంగాణా రాష్ట్ర సేన పార్టీ అధ్యక్షురాలు కవిత ఆంధ్ర ప్రదేశ్ ప్రజలనుద్దేశించి అవమానకరంగా మాట్లాడితే సహించేది లేదని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ హెచ్చరించారు.తాము అధికారంలోకి వస్తే ఆంధ్రుల విగ్రహాలు పీకి పార్సిల్ చేస్తామని చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని మరోసారి ఆంధ్రులపై నోరుజారితే తగిన బుద్ధి చెప్తామని రమేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు లోని అంబేద్కర్ నగర్ లో జరిగిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయాక ముఖ్యమైన పరిశ్రమలు,ప్రభుత్వానికి ఆదాయ వనరులు మొత్తం తెలంగాణా కు ఇచ్చి కట్టుబట్టలతో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని వదిలి విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడిందని ప్రస్తుతం రాజధాని అమరావతి ప్రాంతం అనుక్షణం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రుల గురించి ఆంధ్ర ప్రదేశ్ రాజధాని నిర్మాణం గురించి లిక్కర్ స్కాం లో అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించి జైలు జీవితం అనుభవించిన కవిత కు మాట్లాడే అర్హత లేదన్నారు.మా రాష్ట్రంలో ఉన్న తెలంగాణా ప్రజల పట్ల సోదర భావంతో ఉన్నామని కానీ తెలంగాణా లో నివసించే ఆంధ్రుల పట్ల కవిత లాంటి వారు సవతి తల్లి ప్రేమ చూపిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మరోసారి ఆంధ్రులను విమర్శిస్తే




సహించేది లేదని హెచ్చరించారు

## గ్రామల్లో అవగాహన, చైతన్యం విద్యార్థుల విజ్ఞానంతో మాగులూరి భానుప్రకాష్





**క్రైంకౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. యువతరం విద్యార్థులు గ్రామాలనుండి వెళ్లి ఉన్నత విద్య అభ్యసిస్తూ.. తిరిగి గ్రామాలలో నేటి సమాచార విప్లవం, విజ్ఞానశాస్త్ర దృక్పథంతో కూడిన విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, పర్యావరణం పట్ల అవగాహనను కల్పిస్తున్నారు. ప్రపంచం సాంకేతికత, కృత్రిమమేధతో పరిగెడుతున్నా, మన గ్రామాలలో లోని పరిస్థితులు మాత్రం నిరక్ష్యరాస్యత, వ్యవస్థీకృతమైన అవినీతి, విద్య, వైద్యరంగాల పట్ల కనీస సదుపాయాలు, అవగాహన లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా మరోవైపు గ్రామాలలోని మహిళలకు కాన్సర్, అంటువ్యాదులు, పరిశుభ్రత అనే అంశాల పట్ల సమగ్ర అవగాహనను కల్పించే కార్యక్రమాలను పలు గ్రామాలలో నిర్వహిస్తున్నారు. నేడు సాంకేతిక విప్లవం, విద్యార్థుల విజ్ఞాన చైతన్యమే సమాజాన్ని నడిపిస్తుంది. ఖచ్చితమైన సమగ్ర సమాచారం, సమస్య నివారణ లాంటి అంశాలను గ్రామీణ ప్రజలకు, మహిళలకూ వివరిస్తూ, అవగాహన అనేక గ్రామాలలో కల్పిస్తున్న విద్యార్థులు స్నేహిత, వేదహన్సి, జెరూష, శంకర్ నిరంతర ప్రయత్నం అభినందనీయం.

## గుంటూరు జె సి లా కాలేజీ నందు విజయవంతంగా జరిగిన ఏఐబిఇ మోక్ టెస్ట్

**ది 02 జూన్ 2026. (బాపట్ల క్రైమ్ కౌంటర్ బ్యూరో చీఫ్ రెడ్డి వర ప్రసాద్)** గుంటూరు పట్టణం, నవభారత్ నగర్ 2 వ వీధి నందు గల జె సి లా కాలేజీ ప్రాంగణం నందు ఈ రోజు ఏఐబిఇ ౹౹౹× మోక్ టెస్ట్ విజయవంతంగా జరిపించారు. జె సి లా కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు పరీక్ష పత్రాన్ని విడుదల చేసి మోక్ టెస్ట్ ను ప్రారంభించారు. అనేక మంది విద్యార్థిని విద్యార్థులు ఈ మోక్ టెస్ట్ లో పాల్గొని తమ తమ పరిజ్ఞానాన్ని పరీక్షించుకున్నారు. బార్ కౌన్సిల్ అంతిమ పరీక్ష ఈ నెల 7 వ తేదీన దేశ వ్యాప్తం గా జరుగనున్నందున అల్ ఇండియా లాయర్స్ యూనియన్ మరియు అమరావతి లీగల్ అకాడెమీ ల ఆధ్వర్యంలో గుంటూరు విజయవాడ అనంతపురం మరియు పలు ప్రాంతాలలో ఈ మోక్ టెస్ట్ జరిపినట్లు తెలిపారు. ఈ మోక్ టెస్ట్ లా విద్యార్థిని విద్యార్థులకు మనో ధైర్యాన్ని కల్పించటానికి మరియు మంచి ప్రోత్సాహాన్ని కలిపిస్తుందని వారి వారి పరిజ్ఞానాన్ని పరీక్షించుకొని మరింత కష్టపడి ఫైనల్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలను తేవటానికి ఈ పరీక్ష దోహదపడుతుందని జె సి లా కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు అన్నారు. పరిసర ప్రాంతాల నుండి అనేక లా కాలేజీ లలో లా చదివి బార్ కౌన్సిల్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ మోక్ టెస్ట్ ఎంతో దోహదపడినదని ధన్యవాదాలు తెలిపారు.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

## జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక గత 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు కావలెను.



APTEL/25/A2843

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

ప్రకాశం | సంపుటి : 02 సంచిక : 181 బుధవారం 03- 06 - 2026 పేజిలు : 4 వెల. 2



## రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## మార్కాపురం జిల్లా కేంద్రంలో ఫారెస్ట్ అధికారుల "స్వచ్ఛ్ గావ్ -- సురక్షిత్ జలవాయు" కార్యక్రమ ర్యాలీ...










క్రైమ్ కౌంటర్ న్యూస్.... ఫారెస్ట్ కాంప్లెక్స్ పరిసరాలను కార్యాలయం ముందు ఉన్న మురికి కాలువలోని చెత్త మురుగును తొలగించి పరిశుభ్రం చేసిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది...

## ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు -బీఈఎల్, ఐఐటీ తిరుపతిలో ఇంటర్న్‌షిప్‌లు

క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, నాణ్యమైన సాంకేతిక విద్య, ఇండస్ట్రీ ఓరియెంటెడ్ ట్రైనింగ్, రీసెర్చ్ కల్చర్‌తో విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక సవాళ్లకు సిద్ధం చేస్తున్న ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) మరో విశిష్ట విజయాన్ని నమోదు చేసింది. కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తుది సంవత్సరం విద్యార్థినులు కీర్తన– భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), హైదరాబాద్ మరియు మహిత – ఐఐటీ తిరుపతిలలో ప్రతిష్ఠాత్మక ఇంటర్న్‌షిప్‌లకు ఎంపికై కళాశాలకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చారు.

ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థినులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్, డేటా అనలిటిక్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఆటోనమస్ సిస్టమ్స్, రీసెర్చ్ మెథడాలజీస్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో



శిక్షణపొందనున్నారు. రియల్‌టైమ్ ప్రాజెక్టులు, ఇండస్ట్రీ స్టాండర్డ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్, ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రాక్టికల్ అనుభవాన్ని సొంతం చేసుకోనున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు గ్లోబల్ టెక్నాలజీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే లక్ష్యంతో కళాశాల ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోందన్నారు. అకడమిక్స్‌తో పాటు ఇండస్ట్రీ కనెక్ట్ ప్రోగ్రామ్స్, అడ్వాన్స్‌డ్ టెక్నికల్ ట్రైనింగ్, సర్టిఫికేషన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ సపోర్ట్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ఉన్నత కెరీర్ అవకాశాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. చదలవాడ రవికుమార్ మాట్లాడుతూ, తరగతి గది బోధనతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, టెక్నికల్ స్కిల్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్‌ను అందించడంపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అత్యాధునిక ల్యాబొరేటరీలు, పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపక బృందం, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్, నిరంతర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ఫలితంగానే విద్యార్థులు జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకుంటు న్నారని పేర్కొన్నారు. సీఎస్ఈ(ఏఐ) విభాగాధిపతి డా. కె. సుబ్బా రెడ్డి మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సాంకేతికతలు భవిష్యత్ పరిశ్రమలను ప్రభావితం చేయనున్న నేపథ్యంలో విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ



అందిస్తున్నామని తెలిపారు. రియల్‌టైమ్ ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లు, టెక్నికల్ వర్క్‌షాప్‌లు, ఇండస్ట్రీ నిపుణులతో ఇంటరాక్షన్ సెషన్స్ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. బీఈఎల్, ఐఐటీ తిరుపతి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో విద్యార్థులు ఎంపిక కావడం విభాగం అందిస్తున్న నాణ్యమైన శిక్షణకు నిదర్శనమన్నారు.విద్యార్థినుల ఈ విజయంపై కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు, అన్ని విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలను తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ వర్క్ షాప్



ఒంగోలు క్రైశీ కౌంటర్ ప్రతినిధి,మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన " – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్" వర్క్ షాప్ కార్యక్రమము మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దిశా నిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు



క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు టౌన్ ,టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్క్ షాప్ హాజరై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. వర్క్ షాప్ లో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటర్ల జాబితా పునః పరిశీలన""

## కార్యక్రమం ఎమ్మెల్యే ఇంటూరి






క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ సెంట్రల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన( సర్) సమగ్ర ఓటర్ల జాబితా పునః పరిశీలన శిక్షణ కార్యక్రమం0 ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా సమీక్ష కొత్త ఓటర్ల నమోదుఓటర్ వివరాల సవరణ వంటి పలు కీలక అంశాలపై సిబిఎన్ సమగ్రంగా వివరించారు.

## అసాంఘికకార్యక్రమాలకు పాల్పడితే చర్యలు! ఎస్ఐ ప్రేమ్ కుమార్




వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ప్రేమ్‌కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మేలో 3037 కోట్ల నికర జీఎస్టీ వసూలు

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: మే నెలలో నికర జీఎస్టీ రూ.3037 కోట్లు వసూలైంది. 2026 మేలో అన్ని పన్నుల విభాగాల వసూళ్లు రూ.4950 కోట్లకు చేరుకున్నాయి. 2025 మేలో ఇవి రూ.4165 కోట్లు మాత్రమే. గతేడాది కంటే ఇప్పుడు 19 శాతం వృద్ధి నమోదైంది. ఇరాన్ యుద్ధం వల్ల ఏర్పడిన ప్రతికూల ఆర్థిక ప్రభావాలను తగ్గిస్తూ, పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం ద్వారా పన్ను వసూళ్లు పెరిగాయని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మేలో నికర జీఎస్టీ రూ.2,629 కోట్లు రాగా, 2026 మేలో 16 శాతం వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సెటిల్మెంట్ 15.36 శాతం వార్షిక వృద్ధితో రూ.1758.58 కోట్లు వసూలైంది. పెట్రోలియంపై వ్యాట్ 31.79 శాతం వార్షిక వృద్ధితో రూ.1768.82 కోట్లు వసూలైంది. వృత్తి పన్ను రూ.48.92 కోట్లకు పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక 17 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లలో మొదటిస్థానంలో నిలవగా 16 శాతం వృద్ధితో ఏపీ రెండోస్థానంలో నిలిచింది.




## పారదర్శకతకు ఇదే నిదర్శనం

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా నిర్వహించినట్లు క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో శాప్ ఎండీ భరిణితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వచ్చిన వార్తలు, సందేహాల నేపథ్యంలో వాస్తవ పరిస్థితులను స్పష్టంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో ప్రతి దశను సాంకేతిక ఆధారిత ఆన్‌లైన్ విధానంలో నిర్వహించామని, అభ్యర్థులు దరఖాస్తు సమర్పణ నుంచి ఎంపిక వరకు ఎటువంటి వ్యక్తిగత సంప్రదింపులూ లేకుండానే ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, అందులో 3 శాతం స్పోర్ట్స్ కోటాగా 421 పోస్టులను కేటాయించినట్లు తెలిపారు.



# కుట్రలు, అసత్య ప్రచారాలు ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉన్నాయి

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** శవం, సింపతీ, స్టాట్యూ... గొడ్డలి పార్టీ విధానమిది. వైఎస్ మరణంతో రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారు. ఇప్పుడు అవే విగ్రహాలను ధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నంద్యాలలో వైఎస్ విగ్రహం ధ్వంసం వెనుక గొడ్డలి పార్టీ ఉందనే సాక్ష్యాలను మీడియాకు విడుదల చేశారు. వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన జంబులయ్య అనే గొడ్డలి పార్టీ కార్యకర్త భార్యకు గత ప్రభుత్వంలోనే కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ ఉద్యోగం ఇచ్చారని సాక్ష్యాలతో సహా మీడియా ముందు ఉంచారు. తాము, తమ కుటుంబం వైసీపీకి చెందిన వాళ్లమని జంబులయ్య, ఆయన కుటుంబం సభ్యులు ఇచ్చిన వాంగ్మూలాలనూ మీడియాకు ప్రదర్శించారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి, దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. మనుషుల తలలే తీసిన గొడ్డలి పార్టీ నేతలకు... విగ్రహాల తలలు తీయడం ఓ లెక్క కాదన్నారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు.

విష వృక్షం వైసీపీ: కాలవ'వైసీపీ రాజకీయాల్లో విష వృక్షంలా మారింది. అలాంటి పార్టీ రాష్ట్రానికి అవసరమా..! ప్రజలు ఆలోచించాలి' అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడకూడదనే దురుద్దేశంతో వైసీపీ డీఎస్సీపై విషప్రచారం చేస్తోందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో 13 డీఎస్సీల్లో సుమారు 1.90 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం' అని అన్నారు.

వైసీపీ సమాధి కావడం ఖాయం: అచ్చెన్న

గొడ్డలిపోటు రాజకీయాలు చేసే వైసీపీ భవిష్యత్‌లో పూర్తిగా సమాధి కావడం ఖాయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తోటాడలో ఆయన మాట్లాడారు. 'సొంత మీడియా ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తూ జగన్ అండ్ కో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. 2014–19 కాలంలో టీడీపీ ప్రభుత్వం, 2019–24లో వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి' అని సవాల్ చేశారు.

బాబాయ్‌ని గొడ్డలి వేటుతో చంపినట్లు.. 16 వేల మంది ఉపాధ్యాయులను చంపాలని గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని శాప్ చైర్మన్ రవినాయుడు ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటున్న వైసీపీ, గతంలో గ్రామ సచివాలయాల్లో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన 2000 పోస్టులను ఏ ప్రాతిపదికన చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.జగన్‌వి మతిలేని మాటలు: నిమ్మలఅధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగాల ఊసెత్తని జగన్ ఇప్పుడు మతి స్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నాడని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థులు ప్రతిభతో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధిస్తే తప్పుడు ప్రచారంతో వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు' అని విమర్శించారు.విషప్రచారం మానుకోవాలి: నాగోతుమెగా డీఎస్సీపై జగన్‌రెడ్డి విషప్రచారం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు హితవు పలికారు.

# కూటమి ప్రభుత్వ అభివృద్ధితో వైసీపీలో ఫ్రస్టేషన్

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:**రాష్ట్రంలో వైసీపీ ఆటలు సాగనీయబోమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. "నంద్యాలలో వైఎస్ విగ్రహంపై వైసీపీ వాళ్లే దాడిచేసి సానుభూతి రాజకీయాలు చేద్దామనుకుని కుట్ర పన్నారు. కానీ, క్షణాల్లోనే దొరికిపోయారు. ఆ ఘటనలో నిందితుడిని పట్టుకుంటే జగన్ పత్రిక ఎందుకు రాయలేదు?" అని ఆయన ప్రశ్నించారు. వైసీపీ నేతలు విచ్చలవిడిగా మాట్లాడితే ఉపేక్షించేది లేదని, ఇక్కడ ఉన్నది చంద్రబాబు, బలమైన కూటమి అని గుర్తుపెట్టుకోవాలన్నారు. గొడ్డలి పార్టీది జీవితాంతం నాటకమేనని ఎద్దేవా చేశారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో సీఎం చంద్రబాబు సోమవారం పర్యటించారు. పేదల సేవలో.. కార్యక్రమంలో భాగంగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇంకా ఏమన్నారంటే.. "గొడ్డలి పార్టీ విధ్వంస పాలనతో ప్రజలంతా మోసపోయారు. వివేకా హత్య నుంచి కోడికత్తి, గులకరాయి వరకు ప్రతిదీ నాటకమే. ఏపీ భవిష్యత్తు కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నాం. కానీ గొడ్డలి పార్టీ మాత్రం రాక్షస పన్నాగాలతో కుట్రలు, కుతంత్రాలు అమలు చేస్తోంది. మేం కష్టపడి రాష్ట్రాన్ని పైకి తీసుకువెళ్లడం.. ఆ తర్వాత మళ్లీ రాష్ట్రం అథఃపాతాళానికి పడిపోవడం.. రాష్ట్రంలో మళ్లీ మళ్లీ వైకుంఠపాళీ వద్దు".'వైసీపీ అరాచకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అనేక నేరాలు వాళ్లు చేసి టీడీపీపై నెట్టేసి రాజకీయలాభం పొందాలని చూస్తున్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడన్నారు. విషయం తెలిసి నేను కూడా అయ్యో పాపం అనుకున్నాను. ఇదే విషయం జగన్ చానల్‌లో ప్రసారం చేశారు. తీరా ఆయన కూతురు ఒత్తిడితో పోస్టుమార్టం చేయిస్తే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గుంటూరులో సింగయ్య అనే వైసీపీ కార్యకర్త జగన్ కారు కింద పడిపోతే రోడ్డు పక్కకు లాగి పడేశారు. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళితే అక్కడ చనిపోయారు. దానిపై యాగీ చేశారు. కడప నుంచి పాస్టర్ పాడేరు వెళ్లి డ్రామా ఆడారు. ఆయనే తనపై దాడి చేయించుకుని తనపై దాడి చేశారని డ్రామా ఆడారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి వస్తూ పాస్టర్ చనిపోయాడు. దానిపై పలు అనుమానాలు రేకెత్తించారు. మొత్తం రికార్డు తీయించాం. ఎక్కడెక్కడ తిరిగాడో, ఎక్కడ తాగాడో మొత్తం రికార్డు పోలీసులు బయటకు తీశారు. జగన్ మీడియా తిరుమల కౌస్తుభం గెస్ట్‌హౌస్ వద్ద మద్యం సీసాలు వేసి మద్యం అమ్ముతున్నారని హడావుడి చేయబోయారు. విచారణ చేస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చి జగన్ మీడియా దొరికిపోయింది. కల్తీ నెయ్యితో దేవుడిని అప్రతిష్ఠ పాలు చేసే ప్రయత్నం చేశారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలను నరికేసి, సానుభూతి రాజకీయాలు చేద్దామనుకుని కుట్ర పన్నారు. కానీ, క్షణాల్లోనే దొరికిపోయారు." అని చంద్రబాబు ఆగ్రహించారు. వైసీపీ పాలనలో జాబ్ క్యాలెండర్‌కు దిక్కులేదని, ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని సీఎం మండిపడ్డారు. ఎంతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తే వైసీపీ దానిపై వివాదం లేవనెత్తుతోంది. టీవీలు, సోషల్‌మీడియాల్లో అనుమానాలను రేపే లా కథనాలు సృష్టిస్తున్నారు." అని ఆగ్రహించారు.

ప్రజలు నవ్వుకోవడానికి కూడా లేదు...

"జూన్ నెలకు ఓ విశిష్ఠత ఉంది. రాష్ట్రంలో రెండేళ్ల కిందట వైసీపీ విధ్వంసక పాలనకు తెరపడిన నెల ఇది. ఆ పార్టీ పాలనలో రాష్ట్రంలో ప్రజలు నవ్వుకోవడానికి కూడా లేదు. ఎక్కడా ప్రజలు స్వేచ్ఛగా తిరగడానికి కూడా లేదు. చివరకు జగన్ నిర్వహించిన బహిరంగ సభల్లోంచి జనం వెళ్లిపోతే ఫెన్సింగ్‌లు వేసి అడ్డుకున్నారు. ఆ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు కూటమిగా ఏర్పడాలని తొలుత పొత్తు ప్రకటించింది జనసేన అధినేత పవన్‌కల్యాణ్. చివరకు మూడు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి విజయం సాధించాం. సరిగ్గా రెండేళ్ల కిందట జూన్ 12న ప్రభుత్వం ఏర్పాటుచేశాం. అప్పటికి పది లక్షల కోట్ల అప్పులు. వడ్డీలకు లక్ష కోట్ల చెల్లింపులు తేలాయి. ఆర్థిక వ్యవస్థను పూర్తిగా విధ్వంసం చేశారు. అయినప్పటికీ గడిచిన 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 23 లక్షల ఉద్యోగాలు యువతకు రానున్నాయి. ఈ రెండేళ్లలో ఎన్నో పెట్టుబడుల విజయాలు సాధించాం. అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిత్తల్ దగ్గర నుంచి విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వరకు సాధించాం."

ఆరోగ్య ఏపీకి యోగా మంత్రం..

"పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్ డబ్బులు ఆ నెలతోపాటు అంతకంటే రెండు నెలల వెనకవి కూడా ఇచ్చాం. మేం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రం రూ.పది లక్షల కోట్ల అప్పుల్లో ఉంది. అయినా, 2024 జూలై నుంచి మొత్తం రూ.65,887 కోట్లు పింఛన్ల కింద చెల్లించాం. ఏడాదికి రూ.32 వేల కోట్లు ఈ పథకానికే ఖర్చు చేస్తున్నాం. ఈనెలలో 62.34 లక్షల మందికి రూ.2,729 కోట్లు పింఛన్లు చెల్లిస్తున్నాం. ఒకపక్క పశ్చిమాసియాలో యుద్ధప్రభావంతో గ్యాస్ ధరలు, ఇంధనం ధరలు పెరిగినా, ఇచ్చిన హామీ మేరకు 3ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకం అమలుచేస్తున్నాం. దివ్యాంగశక్తి, అన్నదాత సుఖీభవ, ఇలా అందరినీ ఆదుకుంటున్నాం. ఆగస్టు 15నుంచి ప్రజలఆరోగ్యం కోసం సంజీవిని ప్రాజెక్టు ప్రారంభిస్తున్నాం. మీరు నా ఆరోగ్యం చూస్తూ ఉంటారు. ఎప్పుడూ అనారోగ్యానికి గురికాలేదు.




అతిగా తినను. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో యోగాది కీలకపాత్ర. ప్రపంచాన్ని మనమే మోస్తున్నట్టు పరుగెత్తి అలసిపోవద్దు."

బస్సెక్కి ప్రజలవద్దకెళ్తా

రాష్ట్రంలో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకుంటానని సీఎం పేర్కొన్నారు. ఎక్కడైతే సమస్య ఉందో అక్కడకు బస్సులో ప్రజలను తీసుకుని వెళ్లి పరిశీలిస్తానన్నారు. నెలకు నాలుగైదు రోజులు జిల్లాల పర్యటనల్లో ఉంటున్నానని ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఎలక్ట్రికల్ బస్సు లు తీసుకువస్తామని, ఆ ఏసీ బస్సుల్లో మహిళలు తిరగాలన్నది తన ఆకాంక్ష అని అన్నారు.

గురుకులాల్లోనూ 62 ఏళ్లకు రిటైర్మెంట్ రాష్ట్రంలోని సుమారు 11 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాలు, సొసైటీ పాఠశాలల ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు సీఎం ఆమోదం తెలిపారు. త్వరలోనే ఈ ప్రతిపాదనను క్యాబినెట్‌కు పంపే అవకాశం ఉంది. దీనిపై ఏపీఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు.

పూరీల కోసం చర్చ... అంతా నవ్వులే...

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరం గ్రామంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన పేదల సేవలో... కార్యక్రమంలో అన్నక్యాంటీన్ల ప్రస్తావన వచ్చింది. ఉదయం టిఫిన్‌లో అందిస్తున్న పూరీలు సరిగా పొంగడం లేదని పలుచోట్ల ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన విషయాన్ని సీఎంకు అధికారులు ప్రస్తావించారు. పూరీలు పొంగకపోవడానికి సాంకేతిక కారణాలను అధికారి వివరించే ప్రయత్నం చేయగా, సభా ప్రాంగణంలో సరదా వాతావరణం నెలకొంది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిరునవ్వుతో, కారణాలు చెప్పడం కాదు... సమస్యలు పరిష్కరించడం ముఖ్యం అని వ్యాఖ్యానించారు.

స్థానిక ఎన్నికల్లో ఓట్ల శాతం పెరగాలి

తుని నియోజకవర్గం కార్యకర్తలకు సీఎం నిర్దేశం

రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అనేలా కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. "2024లో కూటమి పొత్తు సూపర్‌హిట్ అయింది. చరిత్రలో ఏ రాజకీయ పార్టీ సాధించలేని రికార్డు సాధించాం. త్వరలో జరగబోయే ఎన్నికల్లో భారీ విజయం సాధించాలి. ఫలానా సెగ్మెంట్‌లో ఓడిపోయామని ఎవరైనా తన దగ్గరకు వస్తే మాట్లాడనంటూ సున్నితంగా హెచ్చరించారు. కార్యకర్తలు ప్రజలకు కనిపించడం మా నేస్తే ప్రభుత్వం మంచి చేసినా అధికారులే చేశారని అనుకుంటారన్నారు. 2024లో టీడీపీకి 55శాతం ఓట్లు వచ్చాయని, ఈసారి ఇంకా మెరుగవ్వాలని సూచించారు. ఈరెండేళ్లలో పార్టీ గ్రాఫ్ పెరిగింది కాబట్టి పర్సంటేజీ పెరగాలని ఆదేశించారు. తుని నియోజకవర్గం ఇంకా కొంత మెరుగవ్వాలని పేర్కొన్నారు. ఇకనుంచి పార్టీ క్యాడర్ ప్రజల్లోకి వాహనాలపై కాకుండా చార్జింగ్ సైకిల్‌పై వెళ్లాలని, మహిళలు ఎలక్ట్రికల్ స్కూటీలపై వెళ్లాలని సూచించారు.

కల్లుగీత కార్మికుడి ఇంటికి సీఎం

సింహాచలం కుటుంబానికి పింఛను కాకినాడ జిల్లా తుని మండలం చామవరంలో కల్లుగీత కార్మికుడు సింహాచలం నివాసాన్ని చంద్రబాబు సందర్శించారు. ఎన్టీఆర్ భరోసా పథకం లబ్ధిదారుడైన సింహాచలానికి సీఎం స్వయంగా రూ. 4వేల పింఛను అందజేశారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతోపాటు సింహాచలం మనవడిని ప్రేమగా ముద్దాడి అందరినీ ఆకట్టుకున్నారు. కుటుంబ సభ్యులతో సరదాగా మాట్లాడి వారి జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. కల్లుగీత వృత్తిలో కష్టనష్టాల గురించి ఆరా తీశారు. తాటిచెట్లపైకి ఎక్కి కల్లు గీయడంలో ఉన్న ప్రమాదాలు, శ్రమ గురించి సింహాచలం వివరించారు. ప్రస్తుతం తాను ఆరు తాటి చెట్ల నుంచి కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నట్టు సీఎంకు తెలిపారు. అలాగే సింహాచలం మేనల్లుడు ముసలయ్య తాటి చెట్టుపైకి ఎక్కి కల్లు తీసే విధానాన్ని ప్రదర్శించారు. కల్లుగీత ప్రక్రియను చంద్ర బాబు ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం తాజాగా తీసిన కల్లును సీఎం చంద్రబాబు రుచి చూశారు.

# పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత



**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యతని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.తిరుపతిలోని ఎల్ఎస్ నగర్‌లో సోమవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టారు. వరదనీటి కాలువలో పేరుకుపోయిన చెత్తను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డితో కలిసి కలెక్టర్ శుభ్రం చేశారు. అనంతరం స్థానికులు, అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ కాలనీలో చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులను ప్రజా భాగస్వామ్యంతో చేపడితే సత్ఫలితాలు వస్తాయన్నారు.కాలనీల్లో చెత్త కుప్పలు, నిల్వ నీరు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. దీనికి ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధాన మురుగునీటి కాలువల్లో వ్యర్థాలు వేయవద్దని సూచించారు.నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, జనసేన నేతలు రాజారెడ్డి, ఆముదాల తులసీరాం, మురళీనాథ రెడ్డి, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణ, 22వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బాల, డేనియల్, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, డీసీ అమరయ్య, మున్సిపల్ హెల్త్ అధికారి యువ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చేందుకు కృషిచేస్తా



**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:**విమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని నూతన డైరెక్టర్ డాక్టర్ వి.మన్మథరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం విమ్స్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో పీజీ కళాశాల, క్యాథలాబ్ ఏర్పాటు సహా గత డైరెక్టర్ కె.రాంబాబు పలు ప్రతిపాదనలు పెట్టారని, వాటిని ముందుకు తీసుకువెళ్లడం ద్వారా రోగులకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేయనున్నట్టు చెప్పారు. ఆస్పత్రికి నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫార్మసిస్టులు వంటి పోస్టుల మంజూరు కోసం యత్నిస్తానన్నారు. విమ్స్ అభివృద్ధి చెందుతున్న దశలో ఉందని, కీలక ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా కృషిచేస్తానన్నారు. ఇందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులతోపాటు అందరి సహకారం కావాలన్నారు. వైద్యులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్ల ఆస్పత్రి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న నిమ్స్ తరహాలో సేవలు అందించే ఉద్దేశంతో విమ్స్‌ను ఏర్పాటు చేశారని, ఆ దిశగా ముందుకు తీసుకువెళతామన్నారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్ గౌర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ అందుబాటులో ఉంటూ విమ్స్‌ను అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషిచేస్తానని మన్మథరావు స్పష్టం చేశారు. సమావేశంలో ఆస్పత్రి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ మనోజ్, ఆర్ఎంవో డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

# విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' ప్రారంభం




**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం కార్యకలాపాలు ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. విశాఖ సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్' భవనంలో ఏర్పాటుచేసిన ఈ కార్యాలయంలోకి అధికారులు, సిబ్బందికి సోమవారం కొత్త జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ సాదరంగా స్వాగతం పలికారు. దీని పరిధిలోని నాలుగు డివిజన్లకు చెందిన రైల్వే మేనేజర్లు (డీఆర్‌ఎంలు) , ప్రధాన విభాగాధిపతులతో భద్రతపై సమీక్ష నిర్వహించారు. భారతీయ రైల్వే చరిత్రలో దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు ప్రక్రియ అరుదైన సందర్భమని, దేశంలో 18వ జోన్‌గా నిలిచిందని తెలిపారు. పాలనా సామర్థ్యం పెంపు, మరింత సమర్థంగా రైళ్ల ఆపరేషన్ నిర్వహణ, ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించడానికి దీనిని ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాంతంలో రైల్వేపరంగా మౌలిక వసతుల అభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడాలని ఆకాంక్షించారు. ఎన్ని చేసినా రైల్వేలో భద్రతకే అధిక ప్రాధాన్యమని.. కొత్త జోన్‌లో కూడా ఇంతేనని.. ప్రతి ఆపరేషన్‌లో ఇది కొనసాగాలని స్పష్టంచేశారు. అధికారులు, సిబ్బంది బృందంగా కలిసి పనిచేయాలని.. దేశంలో ఉత్తమ జోన్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపిచ్చారు. ఈ సందర్భంగా జోన్ సిస్టమ్ మ్యాప్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. నాలుగు డివిజన్ల నుంచి హాజరైన డీఆర్‌ఎంలు లలిత్ బొహ్రా (విశాఖపట్నం), మోహిత్ సొనాకియా(విజయవాడ), సుదేష్ణ సేన్ (గుంటూరు), చంద్రశేఖర్ గుప్తా (గుంతకల్).. తమ పరిధి, ఆస్తుల నిర్వహణ, మానవ వనరులు, ఎదుర్కొంటున్న సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వారు ప్రస్తావించిన సమస్యలకు జీఎం వెంటనే పరిష్కారాలు సూచించడం సమావేశానికి హైలైట్‌గా నిలిచింది.

పల్లా ఆధ్వర్యంలో కూటమి సంబరాలు..

సోమవారం దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డప్పులు, బాణసంచా మోతల మధ్య నృత్యాలు చేశారు. మిఠాయిలు పంచి పెట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రైల్వే జోన్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు పల్లా కృతజ్ఞతలు తెలిపారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, డీసీసీబీ చైర్మన్, జనసేన నేత కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలో సోమవారం ఆయన కొత్త రైల్వేజోన్ బోర్డును ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద కార్యక్రమంలో మాట్లాడారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందన్నారు. రైల్వేజోన్ మంజూరు చేసిన ప్రధాని మోదీకి, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఈ ప్రాంత ప్రజల తరఫున కృత జ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం రైలులో పలాసకు బయల్దేరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తదితరులు పాల్గొన్నారు. పలాస రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సభలోనూ రామ్మోహన్ ప్రసంగించారు.

విశాఖ రైల్వే జోన్ గేమ్ చేంజర్

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఇది ప్రధాని మోదీ కానుక: మాధవ్ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అత్యంత కీలకమైన రైల్వే జోన్ హామీని ఎన్డీఏ ప్రభుత్వం సగర్వంగా నెరవేర్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా దేశంలోనే 18వ రైల్వే జోన్‌గా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' తన అధికారిక కార్యకలాపాలను ప్రారంభించడం ప్రతి ఒక్క ఆంధ్రుడికి గర్వకారణం అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ చరిత్రాత్మక నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గేమ్ చేంజర్ కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో సీఎం చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ 'డబుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కాగా, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యరూపం దాల్చడం.. రాష్ట్ర అభివృద్ధి పథంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఏపీకి రైల్వే జోన్ ప్రధాని మోదీ ఇచ్చిన చరిత్రత్మక కానుక అన్నారు. పోర్టు నగరంగా ఉన్న విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు కావడం వల్ల పోర్ట్ కనెక్టివిటీ, పారిశ్రామిక సరుకు రవాణా, ఎగుమతి-దిగుమతి కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందన్నారు.

# ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లపై విశ్లేషణ

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** 2023 నుంచి 2025 వరకు రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లపై ఉన్నత విద్యాశాఖ విశ్లేషణ చేసింది. ఏ ర్యాంకు విద్యార్థులు ఏ కోర్సుల్లో సీట్లు పొందుతున్నారనే దానిపై ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. స్టేట్ టాపర్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరుతున్నాడు. దాదాపు లక్షన్నర ర్యాంకు వచ్చిన విద్యార్థి కూడా సీఎస్‌ఈలోనే అడ్మిషన్ పొందుతున్నాడు. లక్ష దాటి ర్యాంకులు వచ్చిన వారిలోనూ సీఎ?సఈలో చేరుతున్నవారు ఎంతో మంది ఉంటున్నారు. 2024లో అడ్మిషన్లను పరిశీలిస్తే.. సీఎస్‌ఈలో సగటు ర్యాంకు 80,150గా ఉంది. అంటే ఆ ఏడాది సీఎస్‌ఈలో అడ్మిషన్లు పొందిన వారిలో టాప్ 25 శాతం ర్యాంకర్లు 30 శాతం సీట్లను మాత్రమే తీసుకున్నారు. 25-50 శాతం ర్యాం కర్లు 26 శాతం సీట్లను, 50-75 శాతం ర్యాంకర్లు 24 శాతం సీట్లను పొందారు. చివరి 25శాతం ర్యాంకర్లు కూడా 20 శాతం సీట్లు పొందారు. ఒకప్పుడు టాప్ నుంచి 50శాతం ర్యాంకర్లతోనే సీఎస్‌ఈ సీట్లు నిండిపోయేవి. కానీ ఇప్పుడు పెరిగిన సీట్ల కారణంగా చివరి ర్యాంకుల విద్యార్థులు కూడా ఏదొక కాలేజీలో సులభంగా సీఎస్‌ఈ సీట్లు పొందుతున్నారు. సీఎస్‌ఈ-ఏఐఎంఎల్ సీట్లను మొదటి 25 శాతం ర్యాంకర్లు 35 శాతం పొందారు. ఈ బ్రాంచ్‌లో చివరి ర్యాంకర్లకూ 19శాతం సీట్లు దక్కాయి. సీఎస్‌ఈ డేటా సైన్స్‌లో మొదటి 25శాతం ర్యాంకర్లు 25 శాతం సీట్లు పొందగా... చివరి క్వార్టర్ ర్యాంకర్లు 26 శాతం సీట్లు దక్కించుకున్నారు. సీఎస్‌ఈ-ఏఐలో మొదటి ర్యాంకర్లు కేవలం 17శాతం సీట్లు తీసుకుంటే, చివరి ర్యాంకర్లు 30శాతం సీట్లు తీసుకున్నారు. ఈ బ్రాంచ్ లో సగటు అడ్మిషన్ల ర్యాంకు ఏకంగా 1,05,865. ఈసీఈ కోర్సులో అడ్మిషన్లు చూస్తే మొదటి ర్యాంకర్లు 22శాతం సీట్లు పొందగా, చివరి ర్యాంకర్లు 27 శాతం సీట్లు పొందారు. 2025లోనూ దాదాపుగా ఇదే ట్రెండ్ కనిపించింది.రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. 2023లో మొత్తం మంజూరైన సీట్లు 1,33,236. వాటిలో కన్వీనర్ కోటాలో 77,804, మేనేజ్‌మెంట్ కోటాలో 22,839 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో సీట్ల సంఖ్య 1,66,553కు పెరిగింది. వాటిలో కన్వీనర్ కోటాలో 1,03,686, మేనేజ్‌మెంట్‌లో 30,936 సీట్లు నిండాయి. 2025లో మొత్తం సీట్ల సంఖ్య ఏకంగా 1,87,618కు చేరింది. కన్వీనర్‌లో 1,11,431, మేనేజ్‌మెంట్‌లో 32,648 సీట్లు భర్తీ అయ్యాయి. కాగా, 2025లో మొత్తం సీట్లలో కేవలం సీఎస్‌ఈ సీట్లే 1,01,274 ఉన్నాయి. మొత్తం ఇంజనీరింగ్ సీట్లలో సీఎస్‌ఈ వాటానే 54 శాతంగా ఉంది.

ఇంకా పెంచుతున్న కాలేజీలు



కాలేజీ యాజమాన్యాలు ప్రతి ఏటా సీఎస్‌ఈ సీట్లను పెంచుకుంటూ వెళు తున్నాయి. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం సీఎస్‌ఈతో పాటు కనీసం నాలుగు బ్రాంచ్‌లు తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇతర బ్రాంచ్‌ల్లో విద్యార్థుల చేరికలు భారీగా తగ్గడంతో వాటిలో సీట్లు తగ్గించి, సీఎస్‌ఈ బ్రాంచ్‌ల్లో పెంచుకుంటున్నాయి. మెకానికల్, సివిల్, ఈఈఈ లాంటి బ్రాంచ్‌లు నామమాత్రంగా మారిపోతున్నాయి. సీఎస్‌ఈలోనే ఉప బ్రాంచ్‌లు పెరిగిపోవడంతో వాటిలో సీట్లు పెంచుకుంటూ వెళ్తున్నాయి. ఏఐసీటీఈ కూడా ఉదారంగా సీట్ల పెంపునకు అనుమతులు ఇస్తోంది. సీఎస్‌ఈ సీట్లు పెరగడం వల్ల కాలేజీలకు రాబడి పెరుగుతోంది. ఒకప్పుడు సీఎస్‌ఈలో సీటు రాకపోతే కొందరు డిగ్రీ కోర్సుల్లో చేరేవారు. కానీ ఇప్పుడు ఏదొక కాలేజీలో సీఎస్‌ఈ సీటు లభించే పరిస్థితి రావడంతో డిగ్రీ వైపు చూడటం లేదు. పైగా చివరి ర్యాంకులు వచ్చినవారూ సీఎ?సఈలోనే చేరడం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వంపై పెరుగుతున్న భారం

కాలేజీలు సీట్లు పెంచుకుంటూ పోతుండటం ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారుతోంది. రాష్ట్రం లో ఇంజనీరింగ్ కోర్సుల కనీస ఫీజు రూ.40 వేలుగా ఉ ంది. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంతో మొత్తం భారం ప్రభుత్వంపైనే పడుతోంది. మరోవైపు డిగ్రీ కోర్సుల సగటు ఫీజు రూ.15వేలుగా ఉంది. సీఎస్‌ఈ సీట్లు పెరగడంతో డిగ్రీలో కాకుండా ఇంజనీరింగ్‌లో చేరడం వల్ల ప్రభుత్వానికి భారం అవుతోంది. కాలేజీలు ఏటా సీట్లు పెంచడంతో భారం ఇంకా పెరుగుతోంది.

# ఉత్తరాంధ్ర ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారమైంది.

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** ఉత్తరాంధ్ర ప్రజల నాలుగు దశాబ్దాల కల సాకారమైంది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటైంది. సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్' భవనంలో 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' సోమవారం అత్యంత నిరాడంబరంగా ప్రారంభమైంది. ఎటువంటి హడావిడి చేయకుండా చాలా సాధారణ కార్యాలయంలా జోన్‌ను ఆపరేషన్‌లోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రైల్వేజోన్ పోరాట కమిటీ కన్వీనర్ చలసాని గాంధీ యూనియన్ నాయకులతో కలిసి వెళ్లి జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా కప్పి సన్మానించారు. అక్కడి అధికారులు, ఉద్యోగులు అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ జోన్ రాష్ట్రాభివృద్ధికి, పారిశ్రామిక పురోగతికి, ఉద్యోగ అవకాశాల విస్తరణకు ఆలంబనగా నిలవాలని ఆకాంక్షించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడానికి కమిటీ తరఫున అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంపై దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కొత్త రైల్వే జోన్ ప్రారంభంపై విశాఖ ఎంపీ శ్రీభరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సీపీఐ నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు హర్షం వ్యక్తంచేశారు. ఇదిలావుండగా సిరిపురంలోని కొత్త జోన్ కార్యాలయంలోకి అక్కడి ఉద్యోగులను తప్ప ఇంకెవరినీ అనుమతించలేదు. ఉద్యోగులకు కూడా ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా అనుమతించారు.

అవే బోర్డులు..



# సమర్ధ నాయకత్వం..స్పీడ్

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** సమర్ధ నాయకత్వం, స్పీడ్.. ఏపీని ప్రపంచ పటంలో నిలబెట్టాయని మంత్రి లోకేశ్ వెల్లడించారు. గూగుల్ ఎంత ముఖ్య మో.. ఎంఎస్‌ఎమ్‌ఈ కంపెనీలూ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ రీజియన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, డేటా సెంటర్లపై ఉన్న భయాలను పోగొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి నగరాల సరసన అమరావతిని చేర్చుతామని ప్రకటించారు. ముంబైలో సోమవారం "అభివృద్ధికి కొత్త సరిహద్దులు" పేరిట బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించిన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముఖ్యం..

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా ముఖ్యమని లోకేశ్ చెప్పారు. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటరును తీసుకొచ్చామన్నారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను కేవలం 17 నెలల్లోనే ప్రారంభించామన్నారు. ఇది గ్రీన్‌ఫీల్డ్ రంగంలో దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ పెట్టుబడులలో ఒకటి కాబోతోందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇతర రాష్ట్రాల కంటే రాష్ట్రాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో పెట్టుబడులను విజయవంతంగా రాబడుతోన్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనన్నారు.

ఏఐలో రాష్ట్రం టాప్‌లో ఉండాలి.. ఏఐలో రాష్ట్రాన్ని టాప్‌లో ఉంచేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో 6.5 గిగావాట్ మల్టీ డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యమన్నారు. డేటా సెంటర్ల ద్వారా అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న మరిన్ని భారీ పరిశ్రమలతో కలిసి ఒక ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చే యాలనుకుంటున్నామని చెప్పారు.ప్రఖ్యాత హైపర్ స్కిల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్‌ను విశాఖలో స్థాపించాలని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాను మంత్రి లోకేశ్ కోరారు. ముంబైలో సోమవారం ఎయిర్‌ట్రంక్ సీఈవోతో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. ఆరు గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కాగా, ఎయిర్‌ట్రంక్ ఇండియా ప్రణాళికలు, భారత్‌లో పెట్టుబడుల విస్తరణ రోడ్‌మ్యాప్‌పై ఆలోచన చేస్తున్నామని లోకేశ్‌కు ఖుదా వివరించారు. మహారాష్ట్ర సీఎంతో లోకేశ్ భేటీ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవ?సతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ముంబైలో సీఎం నివాసానికి వెళ్లిన లోకేశ్‌కు ఫడణవీస్ సాదర స్వాగతం పలికారు. ఫడణవీస్‌ను లోకేశ్ మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవా రి ప్రతిమ అందజేశారు. ఫడణవీస్ లోకేశ్‌కు గణేశ్ ప్రతిమను బహూకరించారు. ఏపీకి వచ్చి న పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూ యింగ్ బిజినెస్ గురించి లోకేశ్ ఆయనకు వివరించారు. మహారాష్ట్ర ఐటీ, విద్యాశాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను అడిగి తెలుసుకున్నారు.

# చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో అక్రమాలు



**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రకాశం జిల్లా చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో అక్రమాలపై గనులు, భూగర్భ శాఖ అధికారులు దృష్టిసారించారు. ప్రధానంగా జగన్ హయాంలో అడ్డగోలుగా తవ్వకాలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టినట్లు అనుమానాలు ఉన్న క్వారీల్లో తనిఖీలు ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీఎండీసీ భాగస్వామ్యంతో క్వారీలు నిర్వహించిన సంస్థలను తరిమికొట్టి.. అప్పటి వైసీపీ కీలక నేతలు వాటిని స్వాధీనం చేసుకుని భారీగా లబ్ధి పొందిన విషయం విదితమే. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మామ ప్రత్త?పరెడ్డి నిర్వహిస్తున్న వీరభద్ర గ్రానైట్స్ క్వారీలో సోమవారం అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. ఇవి మరో రెండ్రోజులు కొనసాగే అవకాశం ఉంది. గనుల శాఖ భాగస్వామ్యంతో పల్లవి రెడ్ అనే క్వారీని లీజుకు తీసుకుని క్వారీయింగ్ చేస్తున్న పెరల్ సంస్థను వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే బయటకు పంపారు. అనంతరం జగన్ సమీప బంధువైన ఒకమాజీ ఎంపీ స్వాధీనం చేసుకుని.. బినామీలతో గెలాక్సీ రాళ్లు వెలికితీసి విక్రయించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే క్వారీయింగ్ నిలిపివేసి యంత్ర సామగ్రితో వెళ్లిపోయారు. గనుల శాఖ తిరిగి లీజుదారులను ఆహ్వానించగా పెరల్ సంస్థ పొందింది. పల్లవి రెడ్ నిర్వహించిన క్వారీలో శాంభవీ గ్రానైట్స్ పేరుతో క్వారీయింగ్ చేస్తున్నారు. గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు సోమవారం అందులో తనిఖీలు నిర్వహించారు. 2019 తర్వాత ఆ క్వారీలో జరిగిన గెలాక్సీరాయి వెలికితీత, క్రయవిక్రయాలు, డంపింగ్ నిర్వహణ తదితర అంశాలపై పూర్తి వివరాలివ్వాలని క్వారీ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే వైసీపీ దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి క్వారీల్లో తనిఖీలు నిర్వహించి పలు అక్రమాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. వైసీపీ కీలక నేత బినామీలు నిర్వహించిన క్వారీల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. సోమవారం తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు అనిత, అపర్ణ, రాఘవరావు, గనులు, భూగర్భ శాఖ అధికారులు అరవింద్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# సినిమా



## టైటిల్ మార్చాలని సెన్సార్ బోర్డు చెప్పింది.

మెగాస్టార్ చిరంజీవి సినీ కెరీర్‌కు పునాది వేసిన సినిమా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య చిత్రం ఒక అరుదైన విజయగాథ. 1982 ఏప్రిల్ 23న విడుదలైన ఈ సినిమా, నారాయణగూడ శాంతి థియేటర్‌లో ఏకంగా 525 రోజులు ఆడి ఒక అపురూపమైన రికార్డును నెలకొల్పింది. చిల్లగట్టు శ్రీకాంత్ ఈ చిత్రానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలను, అప్పటి పరిస్థితులను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి ఇంజనీర్ రాజశేఖర్ పాత్ర పోషించగా, గొల్లపూడి మారుతీరావు టైటిల్ రోల్ సుబ్బారావు గా నటించారు. వాస్తవానికి, గొల్లపూడి మారుతీరావు చిరంజీవి నటించిన పలు చిత్రాలకు మాటలు రాశారు. ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్యలో గొల్లపూడి నటించారని తెలిసినప్పుడు చిరంజీవి స్వయంగా ఆశ్చర్యపోయారట. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా షూటింగ్ సమయంలో, చిరంజీవి ఒక లాంచీలో కూర్చుని నారింజ తొనను విసురుతూ, అది నోట్లో పడితే సినిమా హిట్, లేకపోతే ఫట్ అని కోడి రామకృష్ణతో సరదాగా చెప్పిన సంఘటన గుర్తుచేసుకున్నారుచిరంజీవి డాన్స్‌కు ఈ సినిమా ఒక నిదర్శనం.. వచ్చే వచ్చే వానజల్లు పాటలో చిరంజీవి డాన్స్ ఆయన స్వయంగా డాన్స్ కంపోజ్ చేసుకున్నారు. చిరంజీవికి వైట్ కలర్ ప్యాంట్ సెంటిమెంట్ కూడా అప్పటినుంచే మొదలైందని గుర్తు చేసుకున్నారు. సినిమా నిర్మాణం అనంతరం సెన్సార్ బోర్డుతో అనేక సమస్యలు తలెత్తాయి. సుబ్బారావు పాత్రకు సంగీత దర్శకుడు జె.వి.రాఘవులు జై జగదీశ హరే అనే భక్తి గీతాన్ని నేపథ్య సంగీతంగా ఉపయోగించడంపై సెన్సార్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దాసరి నారాయణరావు, డి.వి.ఎస్.రాజు వంటి సినీ ప్రముఖులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేశారు. సినిమా టైటిల్ మార్చి “ఇంట్లో సుబ్బయ్య, వీధిలో దిబ్బయ్య” వంటి పేర్లు పెట్టమని సెన్సార్ అధికారి సూచించారట.

అనేక అడ్డంకులను అధిగమించి విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయం సాధించింది. మహిళల కోసం ప్రత్యేకంగా మ్యాట్నీ షోలు ప్రదర్శించడం ఈ సినిమా విశేషం. అదే ఏడాది జులై 9న విడుదలైన దాసరి నారాయణరావు బొబ్బిలి పులితో పోటీ పడి కూడా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య మంచి విజయాన్ని అందుకుంది. వంద రోజుల వేడుకల్లో దాసరి నారాయణరావు చేతుల మీదుగా చిరంజీవి షీల్డ్ అందుకున్నారు చిరంజీవి. చిరంజీవి కేవలం రెమ్యునరేషన్‌తో సంబంధం లేకుండా పాత్రకు పూర్తి న్యాయం చేస్తారని ఈ సినిమా నిరూపించింది. ఈ చిత్రం తర్వాత శుభలేఖ, రాధ మై డార్లింగ్, బంధాలు అనుబంధాలు, మంచు పల్లకి వంటి కుటుంబ కథా చిత్రాలకు ఇది ఆలంబనగా నిలిచింది. గొల్లపూడి మారుతీరావు, కోడి రామకృష్ణ, కే.రాఘవ వంటి ప్రముఖులు ప్రస్తుతం లేకపోయినా, వారి కృషి వల్ల తెలుగు సినిమా చరిత్రలో ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య ఒక చెరిగిపోని అధ్యాయంగా నిలిచిపోయింది.



## నేరేడు పండ్లు తింటున్నారా..?



వేసవి కాలం ప్రారంభం కాగానే మార్కెట్లో మామిడి పండ్లతో పాటు చిన్న, ముదురు ఊదా రంగులో మెరిసిపోయే నేరేడు పండ్లు కనిపించడం మొదలవుతాయి. తీపి, పులుపు కలగలిసిన వినూత్న రుచితో ఉండే ఈ పండ్లను చాలా మంది కేవలం కాలక్షేపం కోసమో లేదా నాలుక రుచి కోసమో తింటుంటారు. కానీ ఆయుర్వేదంలో నేరేడు పండును ఒక గొప్ప సర్వరోగ నివారిణిగా, ఔషధంగా పరిగణిస్తారని మీకు తెలుసా? మండే ఎండలు, వడదెబ్బల నడుమ.. ఈ చిన్న పండు ఏసీలా శరీరాన్ని లోపలి నుండి చల్లబరచడమే కాకుండా తీవ్రమైన వ్యాధుల నుండి ఇనుప గోడలా కాపాడుతుంది. వేసవిలో నేరేడు పండు తినడం వల్ల శరీరంలో జరిగే ఆ అద్భుతమైన మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం:మధుమేహ రోగులకు సహజ అమృతం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో నేరేడు పండు అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో జాంబోలిన్ అనే ప్రత్యేక మూలకం ఉంటుంది. ఇది మనం తినే ఆహారంలోని పిండిపదార్థం అంత త్వరగా చక్కెరగా మారకుండా నిరోధిస్తుంది. ఈ పండు మాత్రమే కాదు.. నేరేడు గింజల పొడి కూడా మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి మార్కెట్లో విపరీతంగా అమ్ముడవుతోంది.

కడుపు సమస్యలకు శాశ్వత పరిష్కారం

వేసవి కాలంలో మన జీర్ణశక్తి చాలా బలహీనపడుతుంది. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు రావడం సర్వసాధారణం. నేరేడు పండులో ఫైబర్, రాగి పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను పటిష్టం చేసి, కడుపు నొప్పి, విరేచనాల సమస్య నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తాయి.ఎండలోనూ ముఖానికి సహజమైన కాంతి

నేరేడు పండులో విటమిన్ సి మరియు యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి వేసవిలో సూర్యుని నుండి వెలువడే హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండు సహజంగా రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు, మరకలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

గుండెపోటు, రక్తపోటు ప్రమాదాలకు బ్రేక్

ఈ చిన్న పండులో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది హై బీపీని అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. నేరేడు పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా గుండెపోటు, పక్షవాతం వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.

నీరసం మాయం.. రక్తం పెంపుఎండల తీవ్రత కారణంగా వేసవిలో మనం చాలా త్వరగా అలసిపోతుంటాం, నీరసం ఆవహిస్తుంది. నేరేడు పండులో ఉండే ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలనువేగంగా పెంచుతుంది. ఇది రక్తహీనతసమస్యను దూరం చేస్తుంది. దీనితో పాటు ఇందులోని విటమిన్ సి శరీర రోగనిరోధక శక్తిని పెంచి, కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. ప్రకృతి వేసవి తాపం నుండి మనల్ని రక్షించడానికి ఇచ్చిన అద్భుతమైన కానుక నేరేడు పండు. కేవలం రుచి కోసమే కాకుండా పైన పేర్కొన్న ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల కోసం ఈ సమ్మర్‌లో నేరేడు పండ్లను మీ డైట్‌లో భాగం చేసుకోవడం మర్చిపోవద్దు.

## ఇవి ఎండాకాలంలో దేవుడిచ్చిన వరం..



వేసవి కాలం ప్రారంభం కాగానే అందరికీ గుర్తుకు వచ్చేది తాటి ముంజలు. ప్రకృతి ప్రసాదించిన ఈ పండు వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉందని వైద్యులు చెబుతారు. నిజానికి, తాటి ముంజలను వైద్యులు దేవుడిచ్చిన వరంగా అభివర్ణిస్తారు.పోషక విలువలు, శారీరక ఉపశమనం: తాటి ముంజల్లో బీ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. వేసవిలో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. తాటి ముంజలు అధిక నీటి కంటెంట్‌ను కలిగి ఉండటం వల్ల, శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడతాయి. శరీరానికి అవసరమైన ద్రవాలను అందించి, వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఔషధ గుణాలు, చర్మ సంరక్షణ:

తాటి ముంజల గుజ్జుకు ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. కాలిన గాయాలకు, మచ్చలకు పాలపొడితో కలిపి పూతగా వాడటం వల్ల అవి తగ్గుతాయి. అలాగే, ఇది మొహానికి సహజమైన కాంతిని అందించడానికి కూడా తోడ్పడుతుంది.క్యాన్సర్ నివారణ, జీర్ణవ్యవస్థ ఆరోగ్యం:

తాటి ముంజల్లో ఫైటోకెమికల్స్, ఆంథోనిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి రొమ్ము క్యాన్సర్లతో పాటు ఇతర కణితులు రాకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారికి కూడా తాటి ముంజలు ఉపశమనం కలిగిస్తాయి. ఇన్‌డైజేషన్ వంటి సమస్యలను తగ్గించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాలు:

లేత తాటి ముంజలు వికారం తగ్గించడానికి చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. ముఖ్యంగా, గర్భిణులలో గర్భధారణ ప్రారంభ దశలో వచ్చే వాంతులు, వికారాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. చికెన్‌పాక్స్ వచ్చినప్పుడు లేదా వేసవిలో వచ్చే చెమటకాయలు (ప్రిక్లీ హీట్) వంటి చర్మ సమస్యలకు కూడా తాటి ముంజలు సాంప్రదాయకంగా వాడబడుతున్నాయి. ఇవి చర్మాన్ని చల్లగా ఉంచి ఉపశమనాన్ని అందిస్తాయి.

బరువు తగ్గడంలో పాత్ర:

బరువు తగ్గాలనుకునే వారికి తాటి ముంజలు ఒక అద్భుతమైన ఆహారం. వీటిలో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల, తక్కువ కేలరీలతో కడుపు నిండిన అనుభూతిని ఇస్తాయి. ఇది ఎక్కువ సేపు ఆకలి వేయకుండా చేసి, అనవసరమైన ఆహారం తీసుకోవడాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల బరువు తగ్గడం సులభతరం అవుతుంది.

సాంస్కృతిక, ఆర్థిక ప్రాముఖ్యత:

తాటి ముంజలు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో ముఖ్యమైన ఆహార వనరు. పొలాల గట్లపై ఉండే తాటి చెట్ల నుంచి వీటిని సేకరించి అక్కడికక్కడే ఆరగించడం ప్రజల సంప్రదాయం. నగరాలు, పట్టణాల్లో కూడా వీటి వ్యాపారం విస్తృతంగా సాగుతోంది. పెద్దలకు తాటి ముంజలు వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెస్తాయి. ఒకప్పుడు ఇవి ఆకలిని తీర్చడానికి, జీవనోపాధిని కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. రెండు నెలల తర్వాత ఇవే పండ్లుగా మారి, తాటికాయలుగా, టెంకలుగా మారి, రకరకాలుగా ఉపయోగపడేవి. డాక్టర్లు కూడా వేసవి వడగాడ్పుల నుంచి రక్షణ పొందడానికి తాటి ముంజలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. చిన్నలకు, పెద్దలకు అన్ని విధాలుగా ఆరోగ్యకరమైన, చలవ చేసే ఆహారం తాటి ముంజలు.

## డిన్నర్ చేసిన తర్వాత పండ్లు తింటున్నారా?



పండ్లు ఆరోగ్యానికి వరప్రసాదాలు అనడంలో సందేహం లేదు. కానీ, వాటిని తినే ‘సమయం’ కూడా మన జీర్ణశక్తిని ప్రభావితం చేస్తుంది. భోజనం తర్వాత పండ్లు తినడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు ఎందుకు వస్తాయి? అసలు పండ్లు జీర్ణం కావడానికి ఎంత సమయం పడుతుంది? ఆరోగ్య నిపుణుల సలహాల ప్రకారం, మన జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పండ్లను ఎప్పుడు తీసుకోవాలి?సాధారణంగా పండ్లు మన శరీరంలో 20 నుంచి 40 నిమిషాల వ్యవధిలోనే జీర్ణం కావాలి. కానీ, మనం కడుపునిండా భోజనం చేసిన తర్వాత పండ్లను తింటే, అప్పటికే కడుపులో ఉన్న కొవ్వులు, కార్బోహైడ్రేట్లను అరిగించే పనిలో జీర్ణవ్యవస్థ బిజీగా ఉంటుంది. దీనివల్ల పండ్లు జీర్ణాశయంలోనే ఎక్కువ సేపు నిలిచిపోతాయి. ఈ జాప్యం వల్ల పండ్లలోని సహజ చక్కెరలు పులిసిపోయి, కడుపు ఉబ్బరం, గ్యాస్, అధిక తేన్పులు వంటి అసౌకర్యాలకు దారితీస్తాయి.

ఏ పండ్లు తినాలి?

ముఖ్యంగా ఆపిల్స్, మామిడి పండ్లు, పుచ్చకాయల వంటి వాటిలో ‘ఫ్రక్టోజ్’ అనే సహజ చక్కెర ఎక్కువగా ఉంటుంది. మీ జీర్ణవ్యవస్థ ఈ చక్కెరను సరిగ్గా గ్రహించలేకపోతే, అది పేగుల్లోనే ఉండిపోయి పులిసిపోతుంది. ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారు రాత్రి వేళ పండ్లకు దూరంగా ఉండటమే మంచిది.

సరైన సమయం..

జీర్ణక్రియ సజావుగా సాగాలంటే భోజనంతో కలిపి పండ్లను తీసుకోవడం మానేయాలి. భోజనానికి ఒక గంట ముందు పండ్లు తింటే, అవి అప్పటికే జీర్ణమై శరీరానికి పూర్తి పోషకాలను అందిస్తాయి.

సాయంత్రం వేళల్లో చిరుతిళ్లు తినే బదులు పండ్లను తీసుకుంటే అద్భుతంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి జీర్ణశక్తి భిన్నంగా ఉంటుంది. కాబట్టి, మీ శరీరానికి ఏ సమయం సెట్ అవుతుందో గమనించుకుని పండ్ల సమయాన్ని నిర్ణయించుకోండి.

పండ్లు తినడం ఆరోగ్యమే, కానీ వాటిని తినే పద్ధతిని మార్చుకుంటేనే ఆ ఆరోగ్యం సంపూర్ణంగా అందుతుంది. భోజనం తర్వాత పండ్లను తినే అలవాటు ఉంటే, దానిని మానుకుని, విడిగా తీసుకుని చూడండి.. మీ జీర్ణవ్యవస్థలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు!

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:1-94 nekunampuram,pokur,Prakasam,andhrapradesh 523113Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843. Ph:9849707349 . email:kvp6858@gmail.com.

జర్నలిస్టులు కావలెను

క్రైం కౌంటర్ తెలుగు దినపత్రిక
గత 15 సంవత్సరాలుగా పత్రికా
రంగంలో ప్రత్యేక గుర్తింపు
కలిగిన క్రైం కౌంటర్ తెలుగు దిన
పత్రికలో పనిచేసేందుకు
ఆసక్తి, అనుభవం కలిగిన జర్నలిస్టులు
కావలెను.

క్రిష్ణా



APTEL/25/A2844

# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 185 బుధవారం 03- 06 - 2026 పేజిలు : 4 వెల. 2



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349


## ఏలూరు జిల్లాలో అగ్నిప్రమాదం



క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:వేలేరుపాడులో మండలంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వేలేరుపాడులో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోగా, రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూరిళ్లలో ఒక్కసారిగా మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. మంటలు భారీగా ఎగసిడపటంతో ఇళ్లలో ఉన్న ఇద్దరు మహిళలు బయటకు రాలేక మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. మృతుల వివరాలు, అగ్నిప్రమాదానికి కారణాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## శ్రీవారిని దర్శించుకున్న 25.46 లక్షల మంది



క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:మే నెలలో తిరుమల శ్రీవారిని రికార్డుస్థాయిలో 25.46 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి రద్దీ దృష్ట్యా టీటీడీ మే 1వ తేదీ నుంచే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయడంతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శన కోటాను కుదించింది. తొలివారం రద్దీ మోస్తరుగానే ఉన్నప్పటికీ వరుసగా పరీక్షల ఫలితాలు వెలువడిన అనంతరం తిరుమల కొండ రద్దీగా మారిపోయింది. భక్తుల మధ్య తోపులాటలకు ఆస్కారం లేకుండా భక్తులను విడతల వారీగా క్యూలైన్లలోకి అనుమతించారు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అధికారులందరూ సమన్వయంతో పనిచేయడంతో మే నెలలో రికార్డుస్థాయిలో 25.46 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24వ తేదీన అత్యధికంగా 98,058 మంది భక్తులు దర్శించుకున్నారు. హెడ్‌కౌంటర్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇదే రికార్డుగా నమోదైంది. ఏడు సార్లు 90 వేలకుపైగా భక్తులకు శ్రీవారి దర్శనం చేయించగలిగారు. గత నెలలో 12.19 లక్షల మంది సమర్పించారు. అలాగే హుండీ ఆదాయం గత ఏడాది మే నెలలో 106.85 కోట్లు లభించగా గత నెలలో దాదాపు రూ.120.28 కోట్లు లభించింది.

## 7 నుంచి యోగా కార్యక్రమాలు

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:యోగా దినోత్సవాన్ని రాష్ట్రంలో 'యోగాంధ్ర-2026' పేరుతో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని ఇందులో భాగస్వాములను చేస్తామన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు ప్రతిపాదనకు సీఎం ఆమోదముద్ర వేశారని తెలిపారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు యోగా ప్రచారం జరుగుతుందన్నారు. 7న ప్రారంభ కార్యక్రమాన్ని సత్యసాయి జిల్లా లేపాక్షిలో నిర్వహిస్తామన్నారు. 20వ తేదీ వరకు విజయవాడలో యోగా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈనెల 21న ముగింపు కార్యక్రమాలను అమరావతిలో వెస్ట్‌బైపాస్ (కృష్ణా నదిపై నిర్మించిన వంతెన)పై 25 వేల మందితో నిర్వహించే యోగాసనాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణరాజు 4 కేటగిరీల్లో రూపొందించిన వీడియోలను 8142404888 నంబర్ ద్వారా ఉచితంగా వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించినట్టు మంత్రి తెలిపారు

## రాష్ట్రంలో పలుచోట్ల ముందస్తు వర్షాలు

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:ఎల్‌నినో ప్రభావంతో భూమధ్యరేఖను దాటి హిందూ మహాసముద్రం వైపు వీస్తున్న రుతుపవన గాలులు క్రమేపీ బలపడుతున్నాయి. ఇంకా కేరళకు ఆనుకుని ఆగ్నేయ అరేబియా సముద్రం, కేరళ, తమిళనాడుకు ఆనుకుని వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో గత రెండు రోజులుగా కేరళలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రానున్న రెండు, మూడు రోజుల్లో కేరళ, తమిళనాడులోని పలు ప్రాంతాలను నైరుతి రుతుపవనాలు తాకనున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. అలాగే, మూడు లేదా నాలుగో తేదీన రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. రాయలసీమను ఈనెల ఏడు లేదా తొమ్మిదో తేదీన రుతుపవనాలు తాకనున్నాయన్నారు. కాగా, రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించిన తర్వాత దక్షిణాదిలో మిగిలిన ప్రాంతాలకు విస్తరణ నెమ్మదిగా సాగుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ తెలిపింది. దీంతో ఎండ తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది. కాగా.. నెల్లూరు జిల్లా గూడూరులో 43.6, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 43.3, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 43.1, చిత్తూరు జిల్లా సింధురాజపురంలో 42.2, పల్నాడు జిల్లా మాచర్లలో 41.5, నంద్యాల జిల్లా సంజామల, శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లిలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, గాలులతో వర్షాలు, చెదురుమదురుగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉ



పరితల ద్రోణి ప్రభావంతో మంగళవారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 42-44, మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, కృష్ణా, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 40-42, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

## జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లకు ఘన సత్కారం

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:ఒత్తిడి లేని విద్యావిధానం, ఫౌండేషన్ స్థా యి నుంచి అమలు చేసే కరిక్యులమ్, అధ్యాపకుల బోధన, విద్యార్థుల అకుంఠిత దీక్షే జాతీయస్థాయిలో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యాసంస్థలు సాధించే ర్యాంకులకు కారణమని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ స్పష్టం చేశారు. జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను గుంటూరు మెయిన్ క్యాంపస్‌లో సోమవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు సా?ధించిన వెన్నా ప్రవీణ్ కుమార్‌రెడ్డి 6వ తరగతి నుంచే భాష్యం ఐఐటీ ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందినట్టు తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణతో ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ తరగతులు ఉంటాయని వెల్లడించారు. ఫలితంగానే వేర్వేరు విభాగాల్లో తమ విద్యార్థులు జక్కం చాము వర్షిత్ 3వ ర్యాంకు, సిహెచ్.సాహిల్ 6వ ర్యాంకు, డి.పవన్ 16వ ర్యాంకు, కె.రామకృష్ణారెడ్డి 23వ ర్యాంకు, వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి 34వ ర్యాంకు, హఫీజ్ నూర్‌బాషా 42వ ర్యాంకు, వై.ప్రవచన 54వ ర్యాంకు, ఆర్.బాలానాయక్ 76వ ర్యాంకు, సీహెచ్.వెంకట నాగపవన్ ఆలిండియా 82వ ర్యాంకు సాధించారని చెప్పారు. పోటీ పరీక్షలు ఏవైనాసరే ఫలితాల్లో భాష్యం విద్యార్థులు అగ్రస్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. ఇటీవల జేఈఈ మెయిన్ ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్‌తో పాటు ఆలిండియా 11వ ర్యాంకు సాధించిన టి.దుర్గా సుప్రభాత్‌కు ఉన్నత చదువు నిమిత్తం రూ.10 లక్షలు ప్రోత్సాహకం అందించినట్టు తెలిపారు. ర్యాంకులు సా?ధించిన విద్యార్థిని, విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, భాష్యం ఐఐటీ కోఆర్డినేటర్ ఆనందకుమార్ తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నకిలీ ఆధార్ కేసులో వివరాలివ్వండి

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:వ్యక్తిగత గోప్యత పేరు చెప్పి ఆధార్ వివరాలు ఇవ్వడానికి నిరాకరించరాదని ఆధార్ సంస్థ(యూఐడీఏఐ)కు హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. ఆ గోప్యత హక్కును కవచంగా వాడుకొని చట్టం నుంచి తప్పించుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఆధార్ చట్టంలోని సెక్షన్ 33(1) ప్రకారం సమాచారం ఇవ్వడంపై సంపూర్ణ నిషేధం ఏమీ లేదని తెలిపింది. తగిన రక్షణ చర్యలతో కోర్టు ఆదేశాల మేరకు వివరాలు ఇవ్వవచ్చని పేర్కొంది. నకిలీ ఆధార్ సృష్టించి మోసపూరితంగా భూమిని వేరొకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నిందితుడి ఆధార్, బయోమెట్రిక్ వివరాలు పోలీసులకు అందజేయాలని యూఐడీఏఐను ఆదేశించింది. ఈ మేరకు హైకో ర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. విశాఖపట్నంజిల్లా, పెందుర్తి మండలం, సరిపల్లి గ్రామానికి చెందిన సీతారామాంజనేయులకు చెందిన భూమిని నకిలీ ఆధార్ సృష్టించి యండాడకు చెందిన చలమారెడ్డి ప్రవీణ్ కుమార్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన కేసును హైకోర్టు విచారించింది. పిటిషనర్ పేరుపై నకిలీ ఆధార్ సృష్టించారు కాబట్టి వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతుందనే ప్రశ్నే ఉత్పన్నం కాదని పేర్కొంది.




## డీకే శివకుమార్‌తో కలిసి చంద్రబాబు హాజరు



క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: తుంగభద్ర డ్యామ్ కు కొత్తగా బిగించిన 33 క్రస్ట్ గేట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు, కర్ణాటక కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలసి ఈ నెల 25న బటన్‌నొక్కి పైకి ఎత్తనున్నారు. ఆగస్టులో వరదలకు కొట్టుకుపోయిన ఈ గేట్లను గత నెలలో పూర్తిగా మార్చేశారు. జాతీయస్థాయి నిపుణుడు కన్నయ్యనాయుడు రికార్డు సమయంలో ఈ గేట్లను డిజైన్ చేసి, తయారు చేయించారు. గేట్లను తెరిస్తే.. ఈ ఏడాది ఖరీ ఫ్‌కు తుంగభద్ర నుంచి పంటలకు నీరందుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తుంగభద్ర బోర్డు చైర్మన్ ఎస్ఎన్ పాండే మంగళవారం విజయవాడకు రానున్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో భేటీ తర్వాత వారిరువురూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యే అవకాశముంది.

## కొత్త ఆలోచనలకు నజరానా



క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02 యువత వినూత్న ఆలోచనలకు ప్రతిరూపమిచ్చి మరింత మెరుగుపర్చేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్)-మంగళగిరి మరో ముందడుగు వేసింది. ఇందుకోసం మంగళగిరిలో ప్రత్యేక ల్యాబ్ సిద్ధం చేస్తోంది. అడ్వాన్స్‌డ్ ప్రోటో టైపింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్(ఏపీఐసీ ల్యాబ్స్) ఏర్పాటుకు దిగ్గజ కార్ల కంపెనీ కియా, ఆర్‌టీఐహెచ్ సోమవారం అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. కియా-ఇండియా పీఏఓ టయ్‌యూన్ కిమ్‌తో ఆర్‌టీఐహెచ్ సీఈవో ధాత్రిరెడ్డి ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ ఎంఓయూ ఏడాది పాటు ఉంటుంది. ఆర్‌టీఐహెచ్‌లో లేదా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా కొత్త ఆలోచనలకు ప్రతిరూపాన్ని ఇచ్చినందుకు యువతకు మొత్తం రూ.14 కోట్ల దాకా ఇవ్వనున్నారు. నూతన ఆవిష్కరణలు చేసినవారికి కోటి రూపాయల దాకా ప్రోత్సాహకం అందివ్వనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కియా ఈ మొత్తాన్ని అందజేస్తుంది. ఆర్‌టీఐహెచ్, కియా-ఇండియా మధ్య భాగస్వామ్య ఒప్పందం మేరకు ప్రపంచ స్థాయి సదుపాయాలతో ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర పెట్టుబడులలో ప్రతిష్ఠాత్మక సంస్థగా ఉన్న కియా-ఇండియా ఔత్సాహిక యువతకు సాంకేతిక నైపుణ్యాభివృద్ధిలో అవగాహన కల్పించనుంది. అలాగే, జాతీయ స్థాయిలో ప్రఖ్యాత ఐఐటీలలో ఉన్న ల్యాబ్‌ల తరహాలోనే మంగళగిరిలోని ఆర్‌టీఐహెచ్‌లోనూ ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తారు.

# దక్షిణకోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం




**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం కార్యకలాపాలు ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. విశాఖ సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్' భవనంలో ఏర్పాటుచేసిన ఈ కార్యాలయంలోకి అధికారులు, సిబ్బందికి సోమవారం కొత్త జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ సాదరంగా స్వాగతం పలికారు. దీని పరిధిలోని నాలుగు డివిజన్లకు చెందిన రైల్వే మేనేజర్లు (డీఆర్ఎంలు) , ప్రధాన విభాగాధిపతులతో భద్రతపై సమీక్ష నిర్వహించారు. భారతీయ రైల్వే చరిత్రలో దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు ప్రక్రియ అరుదైన సందర్భమని, దేశంలో 18వ జోన్‌గా నిలిచిందని తెలిపారు. పాలనా సామర్థ్యం పెంపు, మరింత సమర్థంగా రైళ్ల ఆపరేషన్ నిర్వహణ, ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించడానికి దీనిని ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రాంతంలో రైల్వేపరంగా మౌలిక వసతుల అభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికి ఇది దోహదపడాలని ఆకాంక్షించారు. ఎన్ని చేసినా రైల్వేలో భద్రతకే అధిక ప్రాధాన్యమని.. కొత్త జోన్‌లో కూడా ఇంతేనని.. ప్రతి ఆపరేషన్‌లో ఇది కొనసాగాలని స్పష్టంచేశారు. అధికారులు, సిబ్బంది బృందంగా కలిసి పనిచేయాలని.. దేశంలో ఉత్తమ జోన్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపిచ్చారు. ఈ సందర్భంగా జోన్ సిస్టమ్ మ్యాప్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. నాలుగు డివిజన్ల నుంచి హాజరైన డీఆర్ఎంలు లలిత్ బొహ్రా (విశాఖపట్నం), మోహిత్ సొనాకియా(విజయవాడ), సుదేష్ణ సేన్ (గుంటూరు), చంద్రశేఖర్ గుప్తా (గుంతకల్).. తమ పరిధి, ఆస్తుల నిర్వహణ, మానవ వనరులు, ఎదుర్కొంటున్న సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వారు ప్రస్తావించిన సమస్యలకు జీఎం వెంటనే పరిష్కారాలు సూచించడం సమావేశానికి హైలైట్‌గా నిలిచింది.

పల్లా ఆధ్వర్యంలో కూటమి సంబరాలు..

సోమవారం దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతో కూటమి నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డప్పులు, బాణసంచా మోతల మధ్య నృత్యాలు చేశారు. మిఠాయిలు పంచి పెట్టారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రైల్వే జోన్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు పల్లా కృతజ్ఞతలు తెలిపారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, డీసీసీబీ చైర్మన్, జనసేన నేత కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలో సోమవారం ఆయన కొత్త రైల్వేజోన్ బోర్డును ఆవిష్కరించి మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద కార్యక్రమంలో మాట్లాడారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందన్నారు. రైల్వేజోన్ మంజూరు చేసిన ప్రధాని మోదీకి, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఈ ప్రాంత ప్రజల తరఫున కృత జ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం రైలులో పలాసకు బయల్దేరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తదితరులు పాల్గొన్నారు. పలాస రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సభలోనూ రామ్మోహన్ ప్రసంగించారు.

విశాఖ రైల్వే జోన్ గేమ్ చేంజర్

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఇది ప్రధాని మోదీ కానుక: మాధవ్

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అత్యంత కీలకమైన రైల్వే జోన్ హామీని ఎన్డీఏ ప్రభుత్వం సగర్వంగా నెరవేర్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా దేశంలోనే 18వ రైల్వే జోన్‌గా 'దక్షిణ కోస్తా రైల్వే జోన్' తన అధికారిక కార్యకలాపాలను ప్రారంభించడం ప్రతి ఒక్క ఆంధ్రుడికి గర్వకారణం అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ చరిత్రాత్మక నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి గేమ్ చేంజర్ కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో సీఎం చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ 'డబుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. కాగా, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యరూపం దాల్చడం.. రాష్ట్ర అభివృద్ధి పథంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఏపీకి రైల్వే జోన్ ప్రధాని మోదీ ఇచ్చిన చరిత్రత్మక కానుక అన్నారు. పోర్టు నగరంగా ఉన్న విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటు కావడం వల్ల పోర్ట్ కనెక్టివిటీ, పారిశ్రామిక సరుకు రవాణా, ఎగుమతి–దిగుమతి కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందన్నారు.



## అవే ఏపీని ప్రపంచపటంలో నిలబెట్టాయి

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** సమర్థ నాయకత్వం, స్పీడ్.. ఏపీని ప్రపంచ పటంలో నిలబెట్టాయని మంత్రి లోకేశ్ వెల్లడించారు. గూగుల్ ఎంత ముఖ్య మో.. ఎంఎస్ఎమ్ఈ కంపెనీలూ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ రీజియన్స్‌ను అభివృద్ధి చేస్తున్నామని, డేటా సెంటర్లపై ఉన్న భయాలను పోగొట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచ స్థాయి నగరాల సరసన అమరావతిని చేర్చుతామని ప్రకటించారు. ముంబైలో సోమవారం "అభివృద్ధికి కొత్త సరిహద్దులు" పేరిట బ్యాంక్ ఆఫ్ అమెరికా నిర్వహించిన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ముఖ్యం..

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా ముఖ్యమని లోకేశ్ చెప్పారు. విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటరును తీసుకొచ్చామన్నారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను కేవలం 17 నెలల్లోనే ప్రారంభించామన్నారు. ఇది గ్రీన్‌ఫీల్డ్ రంగంలో దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ పెట్టుబడులలో ఒకటి కాబోతోందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇతర రాష్ట్రాల కంటే రాష్ట్రాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు ఉందని లోకేశ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో పెట్టుబడులను విజయవంతంగా రాబడుతోన్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనన్నారు.

ఏఐలో రాష్ట్రం టాప్‌లో ఉండాలి..

ఏఐలో రాష్ట్రాన్ని టాప్‌లో ఉంచేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో 6.5 గిగావాట్ మల్టీ డిజిటల్ హబ్‌ను ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యమన్నారు. డేటా సెంటర్ల ద్వారా అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న మరిన్ని భారీ పరిశ్రమలతో కలిసి ఒక ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చే యాలనుకుంటున్నామని చెప్పారు.ప్రఖ్యాత హైపర్ స్కిల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్‌ను విశాఖలో స్థాపించాలని ఆ సంస్థ సీఈవో రాబిన్ ఖుదాను మంత్రి లోకేశ్ కోరారు. ముంబైలో సోమవారం ఎయిర్‌ట్రంక్ సీఈవోతో లోకేశ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని లోకేశ్ కోరారు. ఆరు గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కాగా, ఎయిర్‌ట్రంక్ ఇండియా ప్రణాళికలు, భారత్‌లో పెట్టుబడుల విస్తరణ రోడ్‌మ్యాప్‌పై ఆలోచన చేస్తున్నామని లోకేశ్‌కు ఖుదా వివరించారు.

మహారాష్ట్ర సీఎంతో లోకేశ్ భేటీ

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవ?సతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ముంబైలో సీఎం నివాసానికి వెళ్లిన లోకేశ్‌కు ఫడణవీస్ సాదర స్వాగతం పలికారు. ఫడణవీస్‌ను లోకేశ్ మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవా రి ప్రతిమ అందజేశారు. ఫడణవీస్ లోకేశ్‌కు గణేశ్ ప్రతిమను బహూకరించారు. ఏపీకి వచ్చి న పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ దూ యింగ్ బిజినెస్ గురించి లోకేశ్ ఆయనకు వివరించారు. మహారాష్ట్ర ఐటీ, విద్యాశాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను అడిగి తెలుసుకున్నారు.

# సులభమైపోయిన కంప్యూటర్ సైన్స్ సీటు

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** 2023 నుంచి 2025 వరకు రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లపై ఉన్నత విద్యాశాఖ విశ్లేషణ చేసింది. ఏ ర్యాంకు విద్యార్థులు ఏ కోర్సుల్లో సీట్లు పొందుతున్నారనే దానిపై ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. స్టేట్ టాపర్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో చేరుతున్నాడు. దాదాపు లక్షన్నర ర్యాంకు వచ్చిన విద్యార్థి కూడా సీఎస్ఈలోనే అడ్మిషన్ పొందుతున్నాడు. లక్ష దాటి ర్యాంకులు వచ్చిన వారిలోనూ సీఎ?సఈలో చేరుతున్నవారు ఎంతో మంది ఉంటున్నారు. 2024లో అడ్మిషన్లను పరిశీలిస్తే.. సీఎస్ఈలో సగటు ర్యాంకు 80,150గా ఉంది. అంటే ఆ ఏడాది సీఎస్ఈలో అడ్మిషన్లు పొందిన వారిలో టాప్ 25 శాతం ర్యాంకర్లు 30 శాతం సీట్లను మాత్రమే తీసుకున్నారు. 25–50 శాతం ర్యాం కర్లు 26 శాతం సీట్లను, 50–75 శాతం ర్యాంకర్లు 24 శాతం సీట్లను పొందారు. చివరి 25శాతం ర్యాంకర్లు కూడా 20 శాతం సీట్లు పొందారు. ఒకప్పుడు టాప్ నుంచి 50శాతం ర్యాంకర్లతోనే సీఎస్ఈ సీట్లు నిండిపోయేవి. కానీ ఇప్పుడు పెరిగిన సీట్ల కారణంగా చివరి ర్యాంకుల విద్యార్థులు కూడా ఏదొక కాలేజీలో సులభంగా సీఎస్ఈ సీట్లు పొందుతున్నారు. సీఎస్ఈ–ఏఐఎంఎల్ సీట్లను మొదటి 25 శాతం ర్యాంకర్లు 35 శాతం పొందారు. ఈ బ్రాంచ్‌లో చివరి ర్యాంకర్లకూ 19శాతం సీట్లు దక్కాయి. సీఎస్ఈ డేటా సైన్స్‌లో మొదటి 25శాతం ర్యాంకర్లు 25 శాతం సీట్లు పొందగా... చివరి క్వార్టర్ ర్యాంకర్లు 26 శాతం సీట్లు దక్కించుకున్నారు. సీఎస్ఈ–ఏఐలో మొదటి ర్యాంకర్లు కేవలం 17శాతం సీట్లు తీసుకుంటే, చివరి ర్యాంకర్లు 30శాతం సీట్లు తీసుకున్నారు. ఈ బ్రాంచ్ లో సగటు అడ్మిషన్ల ర్యాంకు ఏకంగా 1,05,865. ఈసీఈ కోర్సులో అడ్మిషన్లు చూస్తే మొదటి ర్యాంకర్లు 22శాతం సీట్లు పొందగా, చివరి ర్యాంకర్లు 27 శాతం సీట్లు పొందారు. 2025లోనూ దాదాపుగా ఇదే ట్రెండ్ కనిపించింది.రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. 2023లో మొత్తం మంజూరైన సీట్లు 1,33,236. వాటిలో కన్వీనర్ కోటాలో 77,804, మేనేజ్‌మెంట్ కోటాలో 22,839 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో సీట్ల సంఖ్య 1,66,553కు పెరిగింది. వాటిలో కన్వీనర్ కోటాలో 1,03,686, మేనేజ్‌మెంట్‌లో 30,936 సీట్లు నిండాయి. 2025లో మొత్తం సీట్ల సంఖ్య ఏకంగా 1,87,618కు చేరింది. కన్వీనర్‌లో 1,11,431, మేనేజ్‌మెంట్‌లో 32,648 సీట్లు భర్తీ అయ్యాయి. కాగా, 2025లో మొత్తం సీట్లలో కేవలం సీఎస్ఈ సీట్లే 1,01,274 ఉన్నాయి. మొత్తం ఇంజనీరింగ్ సీట్లలో సీఎస్ఈ వాటానే 54 శాతంగా ఉంది.

ఇంకా పెంచుతున్న కాలేజీలు



కాలేజీ యాజమాన్యాలు ప్రతి ఏటా సీఎస్ఈ సీట్లను పెంచుకుంటూ వెళు తున్నాయి. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం సీఎస్ఈతో పాటు కనీసం నాలుగు బ్రాంచ్‌లు తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇతర బ్రాంచ్‌ల్లో విద్యార్థుల చేరికలు భారీగా తగ్గడంతో వాటిలో సీట్లు తగ్గించి, సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో పెంచుకుంటున్నాయి. మెకానికల్, సివిల్, ఈఈఈ లాంటి బ్రాంచ్‌లు నామమాత్రంగా మారిపోతున్నాయి. సీఎస్ఈలోనే ఉప బ్రాంచ్‌లు పెరిగిపోవడంతో వాటిలో సీట్లు పెంచుకుంటూ వెళ్తున్నాయి. ఏఐసీటీఈ కూడా ఉదారంగా సీట్ల పెంపునకు అనుమతులు ఇస్తోంది. సీఎస్ఈ సీట్లు పెరగడం వల్ల కాలేజీలకు రాబడి పెరుగుతోంది. ఒకప్పుడు సీఎస్ఈలో సీటు రాకపోతే కొందరు డిగ్రీ కోర్సుల్లో చేరేవారు. కానీ ఇప్పుడు ఏదొక కాలేజీలో సీఎస్ఈ సీటు లభించే పరిస్థితి రావడంతో డిగ్రీ వైపు చూడటం లేదు. పైగా చివరి ర్యాంకులు వచ్చినవారూ సీఎ?సఈలోనే చేరడం వల్ల పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వంపై పెరుగుతున్న భారం

కాలేజీలు సీట్లు పెంచుకుంటూ పోతుండటం ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారుతోంది. రాష్ట్రం లో ఇంజనీరింగ్ కోర్సుల కనీస ఫీజు రూ.40 వేలుగా ఉంది. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంతో మొత్తం భారం ప్రభుత్వంపైనే పడుతోంది. మరోవైపు డిగ్రీ కోర్సుల సగటు ఫీజు రూ.15వేలుగా ఉంది. సీఎస్ఈ సీట్లు పెరగడంతో డిగ్రీలో కాకుండా ఇంజనీరింగ్‌లో చేరడం వల్ల ప్రభుత్వానికి భారం అవుతోంది. కాలేజీలు ఏటా సీట్లు పెంచడంతో భారం ఇంకా పెరుగుతోంది.

# ఎంపీ అవినాశ్‌రెడ్డి మామ క్వారీలో విస్తృత సోదాలు

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రకాశం జిల్లా చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో అక్రమాలపై గనులు, భూగర్భ శాఖ అధికారులు దృష్టిసారించారు. ప్రధానంగా జగన్ హయాంలో అడ్డగోలుగా తవ్వకాలు నిర్వహించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా



గండికొట్టినట్లు అనుమానాలు ఉన్న క్వారీల్లో తనిఖీలు ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీఎండీసీ భాగస్వామ్యంతో క్వారీలు నిర్వహించిన సంస్థలను తరిమికొట్టి.. అప్పటి వైసీపీ కీలక నేతలు వాటిని స్వాధీనం చేసుకుని భారీగా లబ్ధి పొందిన విషయం విదితమే. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మామ ప్రత్త?పరెడ్డి నిర్వహిస్తున్న వీరభద్ర గ్రానైట్స్ క్వారీలో సోమవారం అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. ఇవి మరో రెండ్రోజులు కొనసాగే అవకాశం ఉంది. గనుల శాఖ భాగస్వామ్యంతో పల్లవి రెడ్ అనే క్వారీని లీజుకు తీసుకుని క్వారీయింగ్ చేస్తున్న పెరల్ సంస్థను వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే బయటకు పంపారు. అనంతరం జగన్ సమీప బంధువైన ఒకమాజీ ఎంపీ స్వాధీనం చేసుకుని.. బినామీలతో గెలాక్సీ రాళ్లు వెలికితీసి విక్రయించుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే క్వారీయింగ్ నిలిపివేసి యంత్ర సామగ్రితో వెళ్లిపోయారు. గనుల శాఖ తిరిగి లీజుదారులను ఆహ్వానించగా పెరల్ సంస్థ పొందింది. పల్లవి రెడ్ నిర్వహించిన క్వారీలో శాంభవీ గ్రానైట్స్ పేరుతో క్వారీయింగ్ చేస్తున్నారు. గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు సోమవారం అందులో తనిఖీలు నిర్వహించారు. 2019 తర్వాత ఆ క్వారీలో జరిగిన గెలాక్సీరాయి వెలికితీత, క్రయవిక్రయాలు, డంపింగ్ నిర్వహణ తదితర అంశాలపై పూర్తి వివరాలివ్వాలని క్వారీ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే వైసీపీ దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి క్వారీల్లో తనిఖీలు నిర్వహించి పలు అక్రమాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. వైసీపీ కీలక నేత బినామీలు నిర్వహించిన క్వారీల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. సోమవారం తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు అనిత, అపర్ణ, రాఘవరావు, గనులు, భూగర్భ శాఖ అధికారులు అరవింద్, సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# మేలో 3037 కోట్ల నికర జీఎస్టీ వసూలు

**క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:** మే నెలలో నికర జీఎస్టీ రూ.3037 కోట్లు వసూలైంది. 2026 మేలో అన్ని పన్నుల విభాగాల వసూళ్లు రూ.4950 కోట్లకు చేరుకున్నాయి. 2025 మేలో ఇవి రూ.4165 కోట్లు మాత్రమే. గతేడాది కంటే ఇప్పుడు 19 శాతం వృద్ధి నమోదైంది. ఇరాన్ యుద్ధం వల్ల ఏర్పడిన ప్రతికూల ఆర్థిక ప్రభావాలను తగ్గిస్తూ, పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం ద్వారా పన్ను వసూళ్లు పెరిగాయని రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మేలో నికర జీఎస్టీ రూ.2,629 కోట్లు రాగా, 2026 మేలో 16 శాతం వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సెటిల్మెంట్ 15.36 శాతం వార్షిక వృద్ధితో రూ.1758.58 కోట్లు వసూలైంది. పెట్రోలియంపై వ్యాట్ 31.79 శాతం వార్షిక వృద్ధితో రూ.1768.82 కోట్లు వసూలైంది. వృత్తి పన్ను రూ.48.92 కోట్లకు పెరిగింది. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక 17 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లలో మొదటిస్థానంలో నిలవగా 16 శాతం వృద్ధితో ఏపీ రెండోస్థానంలో నిలిచింది.



# దాని ప్రభుత్వ విలువే 32 కోట్లు

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: వైసీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి పీఏ హోదాలో కేఎన్ఆర్ చేసిన దోపిడీకి అంతే లేదు. విశాఖపట్నంలో రుషికొండ ప్యాలట?సకు సమీపంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో రెండున్నర ఎకరాల భూమి కొన్నట్లు సిట్ గుర్తించింది. ఐటీ పార్క్‌లో ఉన్న దీని విలువ ఇప్పుడు రూ.వంద కోట్ల పైమాటే. దీనిని రూ.32 కోట్లకు కేఎన్ఆర్ కొన్నట్లు గుర్తించిన సిట్ అధికారులు సోమవారం ఆ విషయమై అతడిని సూటిగా ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు 2005లో ఎన్‌సీసీ కంపెనీకి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ నుంచి 97 ఎకరాల భూమి అప్పగించారు. 2013 వరకూ అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ భూమిని తిరిగి దక్కించుకున్న ఎన్‌సీసీ అందులో నిర్మాణాలు మొదలుపెట్టింది. 2019లో జగన్ సీఎం కాగానే వైసీపీ నేతల కన్ను ఆ భూమిపై పడింది. ఎవరి శక్తి కొద్దీ వారు అందులో చేతనైనంత భూమి దక్కించుకోగా.. జగన్ పీఏ కేఎన్ఆర్ సైతం రెండున్నర ఎకరాలు కొట్టేశాడు. విశాఖలో పచ్చని రుషికొండను తవ్వి రూ.వందల కోట్ల ప్రజాధనాన్ని అడ్డగోలుగా ఖర్చు చేసి జగన్ నిర్మించుకున్న రుషికొండ ప్యాలట?సకు అత్యంత సమీపంలోని ఐటీ పార్క్‌లో ఏకంగా రూ.100 కోట్ల విలువ చేసే ఈ భూమిని ఎలా కొన్నారని సిట్ అధికారులు అతడిని ప్రశ్నించారు. అప్పట్లో దాని విలువ రూ.12 కోట్లేనని.. లండన్‌లో ఉంటున్న తన బావమరిది దేవపట్ల రామ్‌భూపాల్‌రెడ్డి ఆ డబ్బులు పంపారని చెప్పాడు. ఏ ఖాతాకు ఎప్పుడు పంపాడు.. ఎవరి ఖాతా నుంచి ఆ సొమ్ము ఆస్తి విక్రేతలకు చేరింది.. అని సిట్ ప్రశ్నించగా.. జవాబివ్వలేక కేఎన్ఆర్ నీళ్లు నమిలినట్లు తెలిసింది. అదీగాక ఆ భూమి ప్రభుత్వ విలువే రూ.32 కోట్లుగా ఉందని, అంతే మొత్తానికి కొనుగోలు చేసినట్లు ఉన్న డాక్యుమెంటు సంగతేంటని దానిని అతడి ముందు పెట్టడంతో అతడు బిత్తరపోయినట్లు సమాచారం. అలాగే లిక్కర్ వ్యాపారులు అప్పట్లో ఇచ్చిన మామూళ్ల వివరాలనూ అతడి నుంచి రాబట్టినట్లు తెలిసింది.

# మెడికల్ కార్పొరేషన్‌లో అవినీతి



క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:మెడికల్ కార్పొరేషన్ అవినీతిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలి వేటు బయో మెడికల్ ఇంజనీర్లపై పడింది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురిని తక్షణమే తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని స్పష్టం చేసింది. కార్పొరేషన్‌లో ఏ ఎక్వి?ప్‌మెంట్ కొనాలన్నా బయో మెడికల్ ఇంజనీర్లే కీలకంగా వ్యవహరిస్తారు. దీంతో ఈ కార్పొరేషన్‌లో అవినీతి వీరితోనే ప్రారంభమవుతోంది. వీరికితోడు ఎక్వి?ప్‌మెంట్ విభాగంలోని ఓ కీలక అధికారి కూడా తోడవడంతో వీరి విచ్చలవిడితనానికి అడ్డు అదుపు లేకుండా సాగింది. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి 'అవినీతి క్యాన్సర్' శీర్షికతో వరుస కథనాలను ప్రచురించింది. బయోమెడికల్ ఇంజనీర్లకు 1.5శాతం ఇస్తేనే పని జరుగుతుందని, కీలక అధికారి కూడా వీరు ఉంటేనే ఆ విభాగంలో పనిచేస్తానంటూ ఆరోగ్య శాఖ అధికారులను బెదిరించే వరకూ వారి అవినీతి బంధం ఎదిగిందని 'ఆంధ్రజ్యోతి' తన కథనాల్లో సవివరంగా పేర్కొంది.

3శాతం అధికారి మాటేంటో..! ఇదే విభాగంలో కోనుగోలు ఉత్తర్వులు(పీవో)లు ఇవ్వాల్సిన అధికారి ఒకరు ప్రతి కొనుగోలుకూ మూడు శాతం ఇవ్వాల్సిందేనంటూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. బయో మెడికల్ ఇంజనీర్లను పంపినట్లుగా ఈయనను పంపుతారా? లేదా? సంస్థ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందా? అన్న చర్చ నడుస్తోంది.

## అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ రేటింగ్‌లో స్థానం

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: వెంకటగిరికి చెందిన ఇద్దరు ఏడవ తరగతి విద్యార్థులు అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ రేటింగ్ సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకొన్నారు.తాజాగా విడుదలైన రేటింగ్ జాబితాలో పట్టణానికి చెందిన కలవ దమరేష్ 1498 రేటింగ్, కలవకొల్లు మధుశ్రీతన్ 1442 రేటింగ్ సాధించారు. దమరేష్ వెంకటగిరి మోడల్ స్కూల్ విద్యార్థి కాగా మధుశ్రీతన్ మదర్‌అకాడమీ స్కూల్‌లో చదువుకుంటున్నారు.చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 24,25,26తేదీల్లో జరిగిన అంతర్జాతీయ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ (బిలో 1650రేటింగ్)లో అవసరమైన పాయింట్లు సాధించారు. సాధారణంగా రేటింగ్ సాధించడానికి పలుమార్లు అంతర్జాతీయ టోర్నమెంట్స్‌లో పాల్గొనాల్సి వస్తుంది. అయితే ఈ ఇద్దరు విద్యార్థులు తొలి అవకాశాన్నే సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటడం విశేషం. మూడేళ్లుగా వెంకటగిరిలోని విజయ్ చెస్ అకాడమీలో వీరు శిక్షణ పొందుతున్నారు.

# ప్రైవేట్ సంస్థలు ఉద్దేశపూర్వకంగా ట్యాక్స్ ఎగవేస్తున్నాయి

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:పంచాయతీలు ఇచ్చే మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు వినియోగించుకుంటున్న ప్రైవేట్ సంస్థలు పన్నులను బాధ్యతాయుతంగా చెల్లించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. పంచాయతీల పరిధిలో ఉన్న పలు సంస్థలు ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఇంకా పన్ను పరిధిలోకి రాని అసట?సమెంట్లను స్వర్ణపంచాయతీల పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా పంచాయతీ అధికారులతో పవన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు పారదర్శకంగా పన్నులు చెల్లిస్తే పంచాయతీలకు ఆర్థిక స్వావలంబన దక్కుతుందని తెలిపారు. ఉద్యోగులు జీతంలో సర్వీస్ ట్యాక్స్ కడుతున్నారని, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మత్స్యకారులు కూడా పన్నులు చెల్లిస్తున్నారని, మరి విద్యాసంస్థలు, పరిశ్రమలు ఎందుకు సరిగా చెల్లించడం లేదని ప్రశ్నించారు. రూ.10వేలు సంపాదించే ఉద్యోగుల మీద భారం పెట్టి రూ.100 కోట్లు ఆర్జించే వారిని వదిలేస్తున్నామన్నారు. ఆంధ్రా పేపర్ మిల్స్ లాంటి సంస్థలు కాలుష్యాన్ని వదలడమే కాకుండా పన్నులు కూడా ఎగవేస్తున్నాయన్నారు. పంచాయతీల్లో పన్నులు సరిగా వసూలు చేస్తే రూ.5,496 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, హోటళ్ల రీఅసట?సమెంట్ కోసం కృష్ణా, ఎన్టీఆర్, చిత్తూరులతో పాటు మొత్తం ఐదుగురు డీపీఓలతో అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న విద్యాసంస్థలు, పరిశ్రమలు, హేచరీస్, హోటళ్లకు పంచాయతీలు అందిస్తున్న సేవలు, ఆ సంస్థలు విడుదల చేసే వ్యర్థాలు, చెల్లిస్తున్న పన్నులు, ఇంకా అసట?సమెంట్‌లోకి రాని ఆస్తులు తదితర వివరాలను కమిటీ పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. పంచాయతీల్లో లేఅవుట్లకు అనుమతిస్తున్న పట్టణాభివృద్ధి అథారిటీలు అక్కడ పారిశుధ్యాన్ని పట్టించుకోవడం లేదని, పన్నుల్లో పంచాయతీలకు రావాల్సిన వాటా ఇవ్వడం లేదని అధికారులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దాన్ని క్యాబినెట్



దృష్టికి తీసుకెళ్తామని, పట్టణాభివృద్ధిశాఖ మంత్రితో చర్చించి పన్నులు నేరుగా పంచాయతీలకు జమయ్యే విధానం అమలయ్యేలా చూస్తామని పవన్ చెప్పారు. కాగా, గ్రామ పంచాయతీల్లో ఎలాంటి తారతమ్యాలు లేకుండా పన్నులు వసూలు చేయాలని పవన్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతుల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలో స్వర్ణ పంచాయతీ పోర్టల్ రాకముందు రూ.75లక్షల ఆదాయం వస్తే స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో అన్ని అసట?సమెంట్ల తర్వాత రూ.2.60 కోట్లకు ఆదాయం పెరిగిందని తిరుపతి డీపీఓ వివరించారు. జాతీయ అవార్డుల ద్వారా చిత్తూరు జిల్లాకు ఇన్సెంటివ్స్ సాధించిన డీపీఓ సుధాకర్‌ను ఈ సందర్భంగా పవన్ అభినందించారు. చెట్టినాడ్ సిమెంట్స్ పన్ను వసూళ్లలో అవకతవకలపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ ఆదాయం పెంచేందుకు ఉన్న ప్రతి అవకాశాన్ని పరిశీలించాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్‌దండే, కమిషనర్ కృష్ణతేజ, పీఆర్, తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలో భారీగా పెరిగిన కేఎన్ఆర్ ఆదాయం




క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02: 2014 నుంచి 2019 దాకా కేఎన్ఆర్ అధికారికంగా చూపించిన మొత్తం ఆదాయం రూ.18.24 లక్షలు మాత్రమే. 2019లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ఆదాయ వేగం పెరిగిన తీరు అంచనాలకు అందడం లేదు. మ ద్యం స్కాం కేసులో కీలక నిందితుడైన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో జరిగిన లావాదేవీల వ్యవహారంలో ఆయన్ని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు ఆయన ఆర్థిక వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆస్తుల గుట్టు రట్టు చేసే పనిలో భాగంగా.. కేఎన్ఆర్‌తో పాటు అతడి చిన్ననాటి స్నేహితుడు, బినామీగా భావిస్తున్న వైసీపీ నేత పుత్తా శివశంకర్‌రెడ్డి, విజయవాడలో హ్యుండాయ్ షోరూం భాగస్వామి ఉస్మాన్ సందీప్, ఆర్థిక లావాదేవీలు జరిపిన మరికొందరు వ్యక్తులను బ్యాంకు స్టేట్‌మెంట్లతో రమ్మన్న సిట్ అధికారులు.. సోమవారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో వారిని సుదీర్ఘంగా ప్రశ్నించారు. చిన్న వ్యాపారంతో జీవనం సాగించిన కేఎన్ఆర్ కొద్ది కాలంలోనే భారీ మూలధన లాభాల ద్వారా కోట్ల ఆదాయ వర్గంలోకి ఎలా చేరారో ఆరా తీశారు.వైసీపీ అధికారంలోకి రాకముందు కేఎన్ఆర్ వార్షిక ఆదాయం రూ.3.64 లక్షలు ఉండగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏకంగా 74.15 లక్షలకు పెరిగింది. జగన్ సీఎం కాక ముందు కేఎన్ఆర్ కుటుంబం చిన్న వ్యాపారం చేస్తున్నట్లు చూపించి మొత్తం టర్నోవర్ రూ.35 లక్షలుగా పేర్కొన్నారు. ఆ వ్యాపారం 2020-21 నుంచే నిలిచిపోయినట్లు బ్యాంకు లావాదేవీలు స్పష్టం చేస్తున్నాయి. కానీ కరోనా తర్వాత కేఎన్ఆర్ రాబడి ఒక్కసారిగా పుంజుకుంది. జీతం తీసుకునే స్థాయి నుంచి జీతభత్యాలు చెల్లించే స్థితికి.. ఇంటికి అద్దె చెల్లించే పరిస్థితి నుంచి పొరుగు రాష్ట్రాల్లో ఇంటి అద్దెలు వసూలుచేసే స్థాయికి.. చేబదుళ్లు తీసుకునే దుస్థితి నుంచి వడ్డీలు వసూలు చేసే ఎత్తుకు అతడు ఎదిగాడు. షేర్ల విక్రయాలు, రియల్ ఎస్టేట్ లావాదేవీలతో భారీగా ఆర్జించినట్లు ఐటీ రిటర్న్స్‌లో చూపించాడు. జగన్ సీఎం అయ్యాక ప్రభుత్వం నుంచి జీతభత్యాలు తీసుకున్న కేఎన్ఆర్.. ఐటీ రిటర్న్స్ దాఖలు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. 2021-22 నుంచి వరుసగా మొదటి ఏడాది రూ.18 లక్షలు, రెండో ఏడాది రూ.30 లక్షలు, ఆ తర్వాత రూ.42 లక్షలు, నాలుగో సంవత్సరం రూ.39 లక్షలు చూపించిన కేఎన్ఆర్.. జగన్ ప్రభుత్వ చివరి ఏడాదిలో రూ.40 లక్షలు స్థూల ఆదాయం పొందినట్లు చూపించాడు. అయితే 2022-23లోనే బెంగళూరులో కొనుగోలు చేసిన ఆస్తి నుంచి అద్దె రూపంలో ఆదాయం వస్తున్నట్లు పొందుపరిచాడు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కేవలం 18 లక్షల ఆదాయం చూపించిన అతడు.. ఐదేళ్ల కాలంలో రూ.4.44 కోట్లకు పెంచుకున్నట్లు ఐటీ రిటర్న్స్ చెబుతున్నాయి. సోమవారం వీటన్నిటిపైనా సిట్ లోతుగా ప్రశ్నించి పై వివరాలన్నీ రాబట్టినట్లు తెలిసింది. దర్యాప్తులో బయటపడుతున్న కేఎన్ఆర్ భారీ ఆస్తుల వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా తీసుకున్నట్లు తెలిసింది. త్వరలోనే అతడికి ఉచ్చు బిగించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు అంటున్నాయి.

# విశాఖలో డీఎస్సీ విజేతల గర్జన

క్రైం కౌంటర్ న్యూస్ జూన్ 02:కష్టపడి డీఎస్సీ రాసి ఉద్యోగాలు సాధిస్తే.. తమపై గొడ్డలి పార్టీ వైసీపీ విష ప్రచారం చేస్తోందని డీఎస్సీ విజేతలు గర్జించారు. డైవర్షన్ రాజకీయాల కోసం తమను అవమానిస్తోందని, అనుమానిస్తోందని మండిపడ్డారు. విశాఖ శివారువేపగుంటలోని వీఎంఆర్‌డీఏ కన్వెన్షన్‌లో సోమవారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన డీఎస్సీ విజేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాలుగు జిల్లాల నుంచి సుమారు 600 మంది 2025-డీఎస్సీ విజేతలు తరలివచ్చారు. డీఎస్సీలో అవకతవకలంటూ వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. 'జగన్ ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు కనీసం ఒక్క నోటిఫికేషన్ కూడా పూర్తి చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి, ఉద్యోగాలు కూడా ఇస్తే అందులో కుట్ర జరిగిందని.. ఏడాది తరువాత ఇప్పుడు వారి రాజకీయ ప్రయోజనాల కోసం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు' అని విజేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ అభ్యర్థులతో గొడ్డలి పార్టీ రాజకీయాలు చేయడం బాధాకరమని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అన్నారు. డీఎస్సీపై 242 కేసులు వేస్తే, వాటిని పరిష్కరించాకే పారదర్శకంగా పోస్టులు భర్తీ చేశారన్నారు. ఉపాధ్యాయులతో పెట్టుకుంటే ఏమవుతుందో జగన్‌మోహన్‌రెడ్డికి ఇంకా తెలిసి రాలేదని హెచ్చరించారు.





నిరుద్యోగులను మోసగించిన జగన్ ఏటా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తానని హామీ ఇచ్చి.. ముఖ్యమంత్రి ఉద్యోగం పొందిన తరువాత నిరుద్యోగులను మోసం చేసిన ఘనుడు జగన్ అని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ విమర్శించారు. మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం చేశారన్నారు. అత్యంత పారదర్శకంగా, సమర్థంగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. ఏడాదిగా వారంతా నిబద్ధతతో ఉద్యోగాలు చేస్తుంటే ఇప్పుడు విషప్రచారం చేయడం దారుణమన్నారు. స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) కేటగిరీలో జిల్లా టాపర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, మెగా డీఎస్సీ పేపరు లీకైందని చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తమన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం వల్లే తమకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటపతిరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సినిమా



## టైటిల్ మార్చాలని సెన్సార్ బోర్డు చెప్పింది.

మెగాస్టార్ చిరంజీవి సినీ కెరీర్‌కు పునాది వేసిన సినిమా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య చిత్రం ఒక అరుదైన విజయగాథ. 1982 ఏప్రిల్ 23న విడుదలైన ఈ సినిమా, నారాయణగూడ శాంతి థియేటర్‌లో ఏకంగా 525 రోజులు ఆడి ఒక అపురూపమైన రికార్డును నెలకొల్పింది. చిల్లగట్టు శ్రీకాంత్ ఈ చిత్రానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలను, అప్పటి పరిస్థితులను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి ఇంజనీర్ రాజశేఖర్ పాత్ర పోషించగా, గొల్లపూడి మారుతీరావు టైటిల్ రోల్ సుబ్బారావు గా నటించారు. వాస్తవానికి, గొల్లపూడి మారుతీరావు చిరంజీవి నటించిన పలు చిత్రాలకు మాటలు రాశారు. ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్యలో గొల్లపూడి నటించారని తెలిసినప్పుడు చిరంజీవి స్వయంగా ఆశ్చర్యపోయారట. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా షూటింగ్ సమయంలో, చిరంజీవి ఒక లాంచీలో కూర్చుని నారింజ తొనను విసురుతూ, అది నోట్లో పడితే సినిమా హిట్, లేకపోతే ఫట్ అని కోడి రామకృష్ణతో సరదాగా చెప్పిన సంఘటన గుర్తుచేసుకున్నారుచిరంజీవి డాన్స్‌కు ఈ సినిమా ఒక నిదర్శనం.. వచ్చే వచ్చే వానజల్లు పాటలో చిరంజీవి డాన్స్ ఆయన స్వయంగా డాన్స్ కంపోజ్ చేసుకున్నారు. చిరంజీవికి వైట్ కలర్ ప్యాంట్ సెంటిమెంట్ కూడా అప్పటినుంచే మొదలైందని గుర్తు చేసుకున్నారు. సినిమా నిర్మాణం అనంతరం సెన్సార్ బోర్డుతో అనేక సమస్యలు తలెత్తాయి. సుబ్బారావు పాత్రకు సంగీత దర్శకుడు జె.వి.రాఘవులు జై జగదీశ హరే అనే భక్తి గీతాన్ని నేపథ్య సంగీతంగా ఉపయోగించడంపై సెన్సార్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దాసరి నారాయణరావు, డి.వి.ఎస్.రాజు వంటి సినీ ప్రముఖులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేశారు. సినిమా టైటిల్ మార్చి "ఇంట్లో సుబ్బయ్య, వీధిలో దిబ్బయ్య" వంటి పేర్లు పెట్టమని సెన్సార్ అధికారి సూచించారట.

అనేక అడ్డంకులను అధిగమించి విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయం సాధించింది. మహిళల కోసం ప్రత్యేకంగా మ్యాట్నీ షోలు ప్రదర్శించడం ఈ సినిమా విశేషం. అదే ఏడాది జులై 9న విడుదలైన దాసరి నారాయణరావు బొబ్బిలి పులితో పోటీ పడి కూడా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య మంచి విజయాన్ని అందుకుంది. వంద రోజుల వేడుకల్లో దాసరి నారాయణరావు చేతుల మీదుగా చిరంజీవి షీల్డ్ అందుకున్నారు చిరంజీవి. చిరంజీవి కేవలం రెమ్యునరేషన్‌తో సంబంధం లేకుండా పాత్రకు పూర్తి న్యాయం చేస్తారని ఈ సినిమా నిరూపించింది. ఈ చిత్రం తర్వాత శుభలేఖ, రాధ మై డార్లింగ్, బంధాలు అనుబంధాలు, మంచు పల్లకి వంటి కుటుంబ కథా చిత్రాలకు ఇది ఆలంబనగా నిలిచింది. గొల్లపూడి మారుతీరావు, కోడి రామకృష్ణ, కే.రాఘవ వంటి ప్రముఖులు ప్రస్తుతం లేకపోయినా, వారి కృషి వల్ల తెలుగు సినిమా చరిత్రలో ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య ఒక చెరిగిపోని అధ్యాయంగా నిలిచిపోయింది.



# నేరేడు పండ్లు తింటున్నారా..?

వేసవి కాలం ప్రారంభం కాగానే మార్కెట్లో మామిడి పండ్లతో పాటు చిన్న, ముదురు ఊదా రంగులో మెరిసిపోయే నేరేడు పండ్లు కనిపించడం మొదలవుతాయి. తీపి, పులుపు కలగలిసిన వినూత్న రుచితో ఉండే ఈ పండ్లను చాలా మంది కేవలం కాలక్షేపం కోసమో లేదా నాలుక రుచి కోసమో తింటుంటారు. కానీ ఆయుర్వేదంలో నేరేడు పండును ఒక గొప్ప సర్వరోగ నివారిణిగా, ఔషధంగా పరిగణిస్తారని మీకు తెలుసా? మండే ఎండలు, వడదెబ్బల నడుమ.. ఈ చిన్న పండు ఏసీలా శరీరాన్ని లోపలి నుండి చల్లబరచడమే కాకుండా తీవ్రమైన వ్యాధుల నుండి ఇనుప గోడలా కాపాడుతుంది. వేసవిలో నేరేడు పండు తినడం వల్ల శరీరంలో జరిగే ఆ అద్భుతమైన మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం:మధుమేహ రోగులకు సహజ అమృతం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో నేరేడు పండు అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో జాంబోలిన్ అనే ప్రత్యేక మూలకం ఉంటుంది. ఇది మనం తినే ఆహారంలోని పిండిపదార్థం అంత త్వరగా చక్కెరగా మారకుండా నిరోధిస్తుంది. ఈ పండు మాత్రమే కాదు.. నేరేడు గింజల పొడి కూడా మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి మార్కెట్లో విపరీతంగా అమ్ముడవుతోంది.

కడుపు సమస్యలకు శాశ్వత పరిష్కారం

వేసవి కాలంలో మన జీర్ణశక్తి చాలా బలహీనపడుతుంది. దీనివల్ల గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలు రావడం సర్వసాధారణం. నేరేడు పండులో ఫైబర్, రాగి పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను పటిష్టం చేసి, కడుపు నొప్పి, విరేచనాల సమస్య నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తాయి.ఎండలోనూ ముఖానికి సహజమైన కాంతి

నేరేడు పండులో విటమిన్ సి మరియు యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి వేసవిలో సూర్యుని నుండి వెలువడే హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండు సహజంగా రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల ముఖంపై మొటిమలు, మచ్చలు, మరకలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

గుండెపోటు, రక్తపోటు ప్రమాదాలకు బ్రేక్

ఈ చిన్న పండులో అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది. ఇది హై బీపీని అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. నేరేడు పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల గుండె రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా గుండెపోటు, పక్షవాతం



వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది.

నీరసం మాయం.. రక్తం పెంపుఎండల తీవ్రత కారణంగా వేసవిలో మనం చాలా త్వరగా అలసిపోతుంటాం, నీరసం ఆవహిస్తుంది. నేరేడు పండులో ఉండే ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలనువేగంగా పెంచుతుంది. ఇది రక్తహీనతసమస్యను దూరం చేస్తుంది. దీనితో పాటు ఇందులోని విటమిన్ సి శరీర రోగనిరోధక శక్తిని పెంచి, కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. ప్రకృతి వేసవి తాపం నుండి మనల్ని రక్షించడానికి ఇచ్చిన అద్భుతమైన కానుక నేరేడు పండు. కేవలం రుచి కోసమే కాకుండా పైన పేర్కొన్న ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల కోసం ఈ సమ్మర్‌లో నేరేడు పండ్లను మీ డైట్‌లో భాగం చేసుకోవడం మర్చిపోవద్దు.

# ఇవి ఎండాకాలంలో దేవుడిచ్చిన వరం..



వేసవి కాలం ప్రారంభం కాగానే అందరికీ గుర్తుకు వచ్చేది తాటి ముంజలు. ప్రకృతి ప్రసాదించిన ఈ పండు వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉందని వైద్యులు చెబుతారు. నిజానికి, తాటి ముంజలను వైద్యులు దేవుడిచ్చిన వరంగా అభివర్ణిస్తారు.పోషక విలువలు, శారీరక ఉపశమనం: తాటి ముంజల్లో బీ విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. వేసవిలో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. తాటి ముంజలు అధిక నీటి కంటెంట్‌ను కలిగి ఉండటం వల్ల, శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడతాయి. శరీరానికి అవసరమైన ద్రవాలను అందించి, వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

ఔషధ గుణాలు, చర్మ సంరక్షణ:

తాటి ముంజల గుజ్జుకు ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. కాలిన గాయాలకు, మచ్చలకు పాలపొడితో కలిపి పూతగా వాడటం వల్ల అవి తగ్గుతాయి. అలాగే, ఇది మొహానికి సహజమైన కాంతిని అందించడానికి కూడా తోడ్పడుతుంది.క్యాన్సర్ నివారణ, జీర్ణవ్యవస్థ ఆరోగ్యం:

తాటి ముంజల్లో ఫైటోకెమికల్స్, ఆంథోనిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి రొమ్ము క్యాన్సర్లతో పాటు ఇతర కణితులు రాకుండా నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారికి కూడా తాటి ముంజలు ఉపశమనం కలిగిస్తాయి. ఇన్‌డైజేషన్ వంటి సమస్యలను తగ్గించి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాలు:

లేత తాటి ముంజలు వికారం తగ్గించడానికి చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి. ముఖ్యంగా, గర్భిణులలో గర్భధారణ ప్రారంభ దశలో వచ్చే వాంతులు, వికారాన్ని తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. చికెన్‌పాక్స్ వచ్చినప్పుడు లేదా వేసవిలో వచ్చే చెమటకాయలు (ప్రిక్లీ హీట్) వంటి చర్మ సమస్యలకు కూడా తాటి ముంజలు సాంప్రదాయకంగా వాడబడుతున్నాయి. ఇవి చర్మాన్ని చల్లగా ఉంచి ఉపశమనాన్ని అందిస్తాయి.

బరువు తగ్గడంలో పాత్ర:

బరువు తగ్గాలనుకునే వారికి తాటి ముంజలు ఒక అద్భుతమైన ఆహారం. వీటిలో నీటి శాతం అధికంగా ఉండటం వల్ల, తక్కువ కేలరీలతో కడుపు నిండిన అనుభూతిని ఇస్తాయి. ఇది ఎక్కువ సేపు ఆకలి వేయకుండా చేసి, అనవసరమైన ఆహారం తీసుకోవడాన్ని తగ్గిస్తుంది. దీని వల్ల బరువు తగ్గడం సులభతరం అవుతుంది.

సాంస్కృతిక, ఆర్థిక ప్రాముఖ్యత:

తాటి ముంజలు గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలంలో ముఖ్యమైన ఆహార వనరు. పొలాల గట్లపై ఉండే తాటి చెట్ల నుంచి వీటిని సేకరించి అక్కడికక్కడే ఆరగించడం ప్రజల సంప్రదాయం. నగరాలు, పట్టణాల్లో కూడా వీటి వ్యాపారం విస్తృతంగా సాగుతోంది. పెద్దలకు తాటి ముంజలు వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెస్తాయి. ఒకప్పుడు ఇవి ఆకలిని తీర్చడానికి, జీవనోపాధిని కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. రెండు నెలల తర్వాత ఇవే పండ్లుగా మారి, తాటికాయలుగా, టెంకలుగా మారి, రకరకాలుగా ఉపయోగపడేవి. డాక్టర్లు కూడా వేసవి వడగాడ్పుల నుంచి రక్షణ పొందడానికి తాటి ముంజలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచిస్తున్నారు. చిన్నలకు, పెద్దలకు అన్ని విధాలుగా ఆరోగ్యకరమైన, చలవ చేసే ఆహారం తాటి ముంజలు.

# డిన్నర్ చేసిన తర్వాత పండ్లు తింటున్నారా?



పండ్లు ఆరోగ్యానికి వరప్రసాదాలు అనడంలో సందేహం లేదు. కానీ, వాటిని తినే 'సమయం' కూడా మన జీర్ణశక్తిని ప్రభావితం చేస్తుంది. భోజనం తర్వాత పండ్లు తినడం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు ఎందుకు వస్తాయి? అసలు పండ్లు జీర్ణం కావడానికి ఎంత సమయం పడుతుంది? ఆరోగ్య నిపుణుల సలహాల ప్రకారం, మన జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పండ్లను ఎప్పుడు తీసుకోవాలి?సాధారణంగా పండ్లు మన శరీరంలో 20 నుంచి 40 నిమిషాల వ్యవధిలోనే జీర్ణం కావాలి. కానీ, మనం కడుపునిండా భోజనం చేసిన తర్వాత పండ్లను తింటే, అప్పటికే కడుపులో ఉన్న కొవ్వులు, కార్బోహైడ్రేట్లను అరిగించే పనిలో జీర్ణవ్యవస్థ బిజీగా ఉంటుంది. దీనివల్ల పండ్లు జీర్ణాశయంలోనే ఎక్కువ సేపు నిలిచిపోతాయి. ఈ జాప్యం వల్ల పండ్లలోని సహజ చక్కెరలు పులిసిపోయి, కడుపు ఉబ్బరం, గ్యాస్, అధిక తేన్పులు వంటి అసౌకర్యాలకు దారితీస్తాయి.

ఏ పండ్లు తినాలి?

ముఖ్యంగా ఆపిల్స్, మామిడి పండ్లు, పుచ్చకాయల వంటి వాటిలో 'ఫ్రక్టోజ్' అనే సహజ చక్కెర ఎక్కువగా ఉంటుంది. మీ జీర్ణవ్యవస్థ ఈ చక్కెరను సరిగ్గా గ్రహించలేకపోతే, అది పేగుల్లోనే ఉండిపోయి పులిసిపోతుంది. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ కలిగిన వారు రాత్రి వేళ పండ్లకు దూరంగా ఉండటమే మంచిది.

సరైన సమయం..

జీర్ణక్రియ సజావుగా సాగాలంటే భోజనంతో కలిపి పండ్లను తీసుకోవడం మానేయాలి. భోజనానికి ఒక గంట ముందు పండ్లు తింటే, అవి అప్పటికే జీర్ణమై శరీరానికి పూర్తి పోషకాలను అందిస్తాయి.

సాయంత్రం వేళల్లో చిరుతిళ్లు తినే బదులు పండ్లను తీసుకుంటే అద్భుతంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి జీర్ణశక్తి భిన్నంగా ఉంటుంది. కాబట్టి, మీ శరీరానికి ఏ సమయం సెట్ అవుతుందో గమనించుకుని పండ్ల సమయాన్ని నిర్ణయించుకోండి.

పండ్లు తినడం ఆరోగ్యమే, కానీ వాటిని తినే పద్ధతిని మార్చుకుంటేనే ఆ ఆరోగ్యం సంపూర్ణంగా అందుతుంది. భోజనం తర్వాత పండ్లను తినే అలవాటు ఉంటే, దానిని మానుకుని, విడిగా తీసుకుని చూడండి.. మీ జీర్ణవ్యవస్థలో వచ్చే మార్పును మీరే గమనిస్తారు!

Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at HNo:21-119 west ibrahimpatnam,krishna andhrapradesh 521456Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2844. Ph:9849707349 . email:kvp6858@gmail.com.